నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
సోమవారం | 05 ఆగస్టు, 2024 | www.navatelangana.com

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-తిర్యాణి



మండలంలోని రొంపల్లి గ్రామ పంచాయితీ మెస్రంగూడ గ్రామానికి చెందిన కనక జంగు అనే హమాలీ కార్మికుడు మంగళవారం అనారోగ్యంతో మరణించాడు. బాధిత కుటుంబ సభ్యులను మండల హమాలీ సంఘటన సభ్యులు పరామర్శించారు. కుటుంబానికి ఉండగా భరోసా కల్పించి సంఘం తరపున రూ.35 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో తిర్యాణి, గిన్నెదరి, చింతపల్లి, ఎదులపాడు, గంబీరావుపేట్, రొంపల్లి హమాలీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-ఖానాపూర్



ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం ఉదయం మండలంలోని మాస్కాపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం... ఖానాపూర్ పట్టణంలోని పద్మావతినగర్‌కు చెందిన లొకిని శివకుమార్(32) కుటుంబ సమస్యలతో మండలంలోని మాస్కాపూర్ గ్రామ శివారులోని వేప చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు గత 3 నెలల కింద మలేషియా దేశం నుంచి తిరిగి వచ్చాడని, పెళ్లి సంబంధాల గురించి చూస్తున్నారని తెలిపారు. శివకుమార్ తమ్ముడు లొకిని రాకేష్ తాగుడుకు అలవాటు పడి ఎంత చెప్పిన వినకపోవడం, ఎం పని చేయక పోవటం వలన తమ్ముని విషయంలో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుడి తండ్రి పెంటన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కరాటే పోటీలో గోల్డ్ మెడల్స్ సాధించిన కేజీబీవీ విద్యార్థులు



నవతెలంగాణ-ఖానాపూర్

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ కేజీబీవీ విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించి, ఉత్తమ ప్రతిభ కనబరిచారు. నల్గొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గంలో 38వ జాతీయ కరాటే ఛాంపియన్ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన కేజీబీవీ విద్యార్థినులు బి.కీర్తన, మల్లీశ్వరి, శాంతిప్రియ, మెడల్స్ అందుకున్నారు. మాస్టర్ ఆరిఫ్‌ఖాన్ ఆధ్వర్యంలో ఈ గోల్డ్ మెడల్ సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సభను విజయవంతం చేయాలని ఆదివారం కుమురంభీం కాలనీలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహణ అధ్యక్షులు గోడం గణేష్ మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ సెంట్రల్ గార్డెన్ వరకు ర్యాలీ, అనంతరం ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థి, యువజన, కార్మిక, కర్షక, మేధావి ఉద్యోగ ఉపాధ్యాయ నాయకులు, ఆదివాసీ ప్రజలు, గ్రామ పటేల్, దేవారి మహాజన్, సార్మేడిలు ఆదివాసీ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రపంచ ఆదివాసీ దినోత్సవ పోరాట సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చెడ్మకి ఆనంద్‌రావు, ఆదిలాబాద్ రూరల్ మండలాధ్యక్షుడు మెస్రం కేశవరావు, తుడుం దెబ్బ ఉపాధ్యక్షులు గెడం రాము, రైతు సంఘం డివిజన్ కమిటీ ఉపాధ్యక్షులు మెస్రం తులసిరామ్, సెడ్మకి భూమన్న, మెస్రం నాగోరావు, మెస్రం దేవ్‌రావు, కొట్నక్ జైతూ, మెస్రం దినేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేసిన గల్ఫ్ మిత్ర బృందం



నవతెలంగాణ-కడెం

మండలంలోని అంబారిపేట్ గ్రామంలో బొమ్మని నర్సయ్య సిరిసిల్లలో చేనేత కార్మికునిగా పని చేసేవాడు. గత వారం రోజుల కింద గుండెపోటుతో మరణించాడు. కాగా ఆదివారం గల్ఫ్ మిత్ర బృందం ఆధ్వర్యంలో రూ.14,300 ఆర్థిక సాయాన్ని వారి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రెంకాల శ్రీనివాస్, హన్మాండ్లు, వెంకటేష్, తాటికొండ రవి, గల్ఫ్‌మిత్ర బృందం సభ్యులు పాల్గొన్నారు.

సలీం మృతి పార్టీకి తీరని లోటు

- మృతునికి సంతాపం తెలిపిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

సలీం మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం ఉదయం కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ సలీం విద్యుద్ఘాతానికి గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సలీం అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఆయన స్వయం కృషితో ఎదిగి సమాజంలో మంచి గుర్తింపు పొందారన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలో తేవడానికి తనతో కలిసి నిరంతరం కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన అకాల మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. కాంగ్రెస్ వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కొలువుల జాతర.. సర్కారు బాసట..!



- జాబ్ క్యాలెండర్ విడుదలతో నిరుద్యోగుల్లో హర్షం
- వరుస నోటిఫికేషన్లతో ప్రిపేర్ అయ్యేందుకు సన్నద్ధం
- వేలాది మంది నిరుద్యోగులకు ప్రయోజనం

నిరుద్యోగులకు సర్కారు బాసటగా నిలుస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో నిరుద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇది వరకే ఉపాధ్యాయ పోస్టులకు డీఎస్సీ నిర్వహించగా.. అక్టోబర్ నుంచి వివిధ రకాల నోటిఫికేషన్లు జారీ చేసేందుకు నిర్ణయించింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఏ ఉద్యోగానికి ఏ నోటిఫికేసన్ జారీ అవుతుందో ముందస్తుగానే అభ్యర్థులకు తెలియడంతో వారు మరింత పకడ్బందీగా పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు ఆస్కారం ఉంటుంది. ఉద్యోగ నోటిఫికేషన్ల జారీ కోసం ఎదురుచూసే పరిస్థితి నుంచి నిరుద్యోగులకు ఉపశమనం కలగనుంది. సర్కారు కొలువు సాధించడమే లక్ష్యంగా ఏండ్ల తరబడి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు సర్కారు నిర్ణయం ప్రయోజనం కలిగించనుంది. రానున్న అక్టోబర్ నుంచి వచ్చే ఏడాది 2025 జులై వరకు జారీ చేయనున్న నోటిఫికేషన్ల వివరాలను వెల్లడించింది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే పరిస్థితి లేదు. ప్రభుత్వం ముందే ఆయా ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేసే తేదీలను ప్రకటించడంతో ఆ పరిస్థితి దూరం కానుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో నిరుద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. రానున్న అక్టోబర్ నెల నుంచి వరుసగా గ్రూప్- 1, గ్రూప్-2, గ్రూప్-3తో పాటు అటవీ బీట్ అధికారులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్లు, ఇంజనీరింగ్ విభాగాల్లో ఏఈఈ, ల్యాబ్ టెక్నీషియన్లు, నర్సింగ్, ఫార్మాసిస్టులు, ట్రాన్స్‌కో ఏఈఈలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు, గురుకుల డిగ్రీ అధ్యాపకులు, సింగరేణి ఉద్యోగాలకు రానున్న ఏడాది జులై వరకు జారీ చేసిన నోటిఫికేషన్ల ప్రకారం పోటీపరీక్షలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ప్రభుత్వం ముందస్తుగానే ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేయడంతో ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న నిరుద్యోగులు ఎదురుచూసే పరిస్థితి ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వేలాదికి మందికి ప్రయోజనం..!

ప్రభుత్వ తాజా నిర్ణయం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలాది మంది నిరుద్యోగులకు ప్రయోజనం చేకూర్చనుంది. కేవలం ఒక్క ఉపాధ్యాయ పోస్టులకే బీఈడీ, డీఎడ్ పూర్తయిన వారు ఉమ్మడి జిల్లాలో సుమారు 50వేల మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. ఇక డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఉమ్మడి జిల్లాలో లక్షల్లోనే ఉంటారు. వీరిలో చాలా మంది ఆయా విభాగాల్లోని పోటీ పరీక్షలకు అర్హులవుతారు. పోటీ అధికంగా ఉంటున్నా.. పోస్టులను దక్కించుకోవాలనే ఉత్సాహంతో అనేక మంది శిక్షణ తీసుకుంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ముందస్తుగానే జాబ్ నోటిఫికేషన్ వేయడంతో పరీక్షలకు సిద్ధమవుతున్న వారు వరుసగా పోటీ పరీక్షలు రాసేందుకు వీలుంటుంది. వీటి కోసం మంచి ప్రణాళిక తయారుచేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఆయా పరీక్షలకు సంబంధించి సమయాలను బట్టి ప్రిపేర్ అయ్యేందుకు ఆస్కారం లభిస్తుందని పోటీ పరీక్షల శిక్షణ నిర్వాహకులు చెబుతున్నారు. గతంలో ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూసే పరిస్థితి ఉండటంతో వేలాది మంది యువత నిరుత్సాహంతో ఉండేవారు. తాజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అనేక మందికి ఉత్సాహాన్ని కలిగిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



పకడ్బందీగా అమలు చేయాలి

పవన్‌కుమార్, యువకుడు



ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం చాలా మంచి నిర్ణయం. కానీ దీనిని పకడ్బందీగా అమలుచేయాలి. ఏ నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందో స్పష్టంగా చెప్పాలి. తాజా నిర్ణయంతో నిరుద్యోగులు ముందస్తుగానే పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు అవకాశం లభిస్తుంది. ముందస్తు పోస్టుల సంఖ్య కూడా చూపిస్తే బాగుంటుంది.

ప్రభుత్వం నిర్ణయం బాగుంది

ప్రవీణ్‌కుమార్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్



ప్రభుత్వం ముందస్తుగానే జాబ్‌క్యాలెండర్ విడుదల చేయడం బాగుంది. ఉద్యోగాల కోసం ప్రిపేర్ అయ్యేవారు నోటిఫికేషన్ల కోసం ఎదురుచూసే పరిస్థితి లేకుండా ముందస్తుగానే వారికి తెలియడంతో మరింత ఉత్సాహంగా సన్నద్ధమయ్యేందుకు ఆస్కారం ఉంటుంది. ఒక ప్రణాళిక ప్రకారం చదివేందుకు అవకాశం లభిస్తుంది.

స్వచ్ఛదనం... పచ్చదనం

- నేటి నుంచి ఐదు రోజుల పాటు నిర్వహణ
- పల్లె, పట్టణాలో పారిశుధ్యం, మొక్కలు నాటే కార్యక్రమాలు

నవతెలంగాణ-కెరమెరి

పల్లెలు, పట్టణాల్లో ఇక స్వచ్ఛంద సంస్థలు స్వచ్ఛ ధనం.. పచ్చదనం పేరిట అభివృద్ధి పారిశుద్య కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ఇటీవల శాసనసభ సమావేశాల్లో మంత్రి సీతక్క ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ అంశంపై మూడు రోజుల క్రితం సీఎస్ శాంతి కుమారి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో పాటు అధికారులకు సూచనలు చేశారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా మొక్కల పెంపకం ఇతర చర్యలు చేపట్టాలన్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

ప్రత్యేక మార్గదర్శకాలు జారీ

జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఈనెల 5వ తేదీ నుంచి 9 వరకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఏ రోజు ఏఏ కార్యక్రమాలు నిర్వహించాలో తెలియజేస్తూ ప్రభుత్వం మార్గదర్శాలు జారీ చేసింది. సీఎస్ శాంతి కుమారి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దిశా నిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ వెంకటేష్ ధోత్రే జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల అధికారులు ఉద్యోగులతో సమీక్షించి పలు సలహాలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. స్వచ్ఛంద సంస్థలు యువజన సంఘాలు మహిళా సంఘాలు ప్రజాప్రతినిధులు ప్రజల భాగస్వామ్యం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో ఉండేలా చూడాలని సూచించారు.

తొలిరోజు చేపటాల్సిన పనులు

పల్లెలు, పట్టణంలో స్థానిక నాయకులు, మహిళా సంఘాలు యువతతో అవగాహన ర్యాలీలు నిర్వహించాలి. ఇళ్లలోని చెత్తను సేకరించి కంపోస్టు ఎరువుల తయారుకు ప్రయత్నించాల్సి ఉంటుంది. పారిశుద్యం, మొక్కల పెంపకం సీజనల్ వ్యాధులపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తారు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రదేశాలను శుభ్రపరుస్తారు. చెత్త సేకరణ వాహనాలను జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం అమర్చనున్నారు. మరుగుదొడ్లు లేని వారికి మంజూరు చేయాల్సి ఉంటుంది.

రెండవ రోజు

తాగునీటి వనరులను శుభ్రపరుస్తారు. రోజు ఫ్లోరినేషన్ నిర్వహించాలా ప్రజలను చైతన్య



పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న జీపీ కార్మికులు

పరచడంతో పాటు క్లోరినేషన్ కిట్లను అందుబాటులో ఉంచాలి. ఇంకుడు గుంతలు లేని ఇళ్ల వద్ద వాటిని నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. తాగునీరు, తాగునీటి చెరువులు, కుంటలు కబ్జాలు, ఆక్రమణలకు గురికాకుండా స్థానికులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మూడో రోజు

మురుగు కాల్వలో పూడిక తొలగించనున్నారు. వర్షం మురుగునీరు నిలవకుండా డ్రైనేజీ మళ్లించాల్సి ఉంటుంది. ముంపు ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ పనులు చేపట్టానున్నారు. స్థానిక రోడ్లపై గుంతలను మట్టితో పూడ్చి రోలింగ్ చేయనున్నారు. చేతి పంపులు, పైప్‌లైన్‌ల వద్ద మురుగునీరు నిలవకుండా చూసుకోనున్నారు.

నాలుగో రోజు

వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి సీజనల్ వ్యాధులు డెంగీ మలేరియా వంటి వాటిపై అవగాహన కల్పించానున్నారు. గ్రామాల్లో జ్వర సర్వే ప్రజలు తరచూ జ్వరం బారిన పడుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. నీరు నిలవ ఉన్నచోట ఆయిల్ బాల్స్, వీధి కుక్కల సంఖ్య తెల్చి గ్రామ కార్యదర్శిలు, మున్సిపల్ కమిషనర్ల సమన్వయంతో వాటిని ఏబీసీ కేంద్రాలకు తరలిస్తారు.

చివరి రోజు నిర్వహించాల్సిన కార్యక్రమాలు


మంగళ శుక్రవారం డ్రై డేగా పాటించాల్సి ఉంటుంది. ప్రభుత్వ సంస్థల కార్యాలయాలు, భవనాలు శుభ్రం చేయడం వంటివి నిర్వహించనున్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించనున్నారు. రోడ్ల పక్కన ఎండిపోయిన చెట్లను తీసేయడం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ఏ రోజుకు ఆరోజు సమీక్షిస్తూ..

స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాలపై కలెక్టర్ ఏ రోజుకు ఆ రోజు సమీక్షిస్తూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేలా అధికారులను అప్రమత్తం చేస్తారు. పంచాయతీ కార్యదర్శి మరో ముగ్గురు అధికారులతో కూడిన బృందం గ్రామస్థాయిలో కార్యక్రమ అమలుకు బాధ్యత వహించాలని ఉంటుంది. గ్రామాల్లో జరుగుతున్న పనులకు సంబంధించిన నివేదికను పంచాయతీ ప్రత్యేక అధికారి జిల్లా అధికారులకు ఎప్పటికప్పుడు పంపించాల్సి ఉంటుంది.

ప్రజల సహకారంతోనే విజయవంతం చేస్తాం

ఎంపీడీఓ అంజాత్ పాషా



అన్ని వర్గాల భాగస్వామ్యంతో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేస్తాం. పల్లెలు, పట్టణాల్లో పారిశుద్ధం పారిశుభ్రత పచ్చదనం పెంపొందించడానికి అనుగుణంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, యువజన మహిళా సంఘాల సభ్యులు పాల్గొనాల్సి ఉంటుంది. పకడ్బందీగా కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశాం.

నిండు కుండలా చెరువులు.. జోరుగా ఆయకట్టు కింద వరినాట్లు

నవతెలంగాణ-లోకేశ్వరం



వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులన్ని నిండు కుండలా మారి, జలకళను సంతరించుకున్నాయి. ఇన్ని రోజులు రైతులు వర్షాల కోసం ఎదురు చూడగా, వారం రోజులుగా వర్షాలు కురువడంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. తమ పంట పొలాలను సిద్ధం చేసి, వరి నాట్లు వేస్తున్నారు. చెరువులు నిండుతాయో లేవోనన్న సందేహంలో ఉన్న రైతులు ఈ వర్షాలతో వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమై ఉన్నారు. ఆయకట్టు రైతులు మొదట్లో ఆందోళన చెందినప్పటికీ, సమృద్ధిగా వానలు కురువడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెరువులు నిండితేనే, తమ పంటలు పండుతాయని సంతోషం వ్యక్తం చేశారు.

పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ పేరు మార్చద్దు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ పేరు మార్చకూడదని అదేవిధంగా ఉంచాలని ఆర్యవైశ్య సంఘం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ వాసవి క్లబ్ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు వెంకన్న డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన సమావేశంలో కమిటీ సభ్యులు పేరు మార్పు నిర్ణయాన్ని ఖండించారు. పొట్టి శ్రీరాములు యూనివర్సిటీకి ప్రతాప్ రెడ్డి పేరు పెడతామని అసెంబ్లీలో ప్రతిపాదించిన తీర్మానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పొట్టి శ్రీరాములు ఏ విధంగానైతే ప్రత్యేక రాష్ట్రం కోసం తన జీవితాన్ని అర్పించారో ఆర్యవైశ్యులు కూడా అదే విధంగా చేస్తారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రెడ్డిలు రావులు పెనుమలు వీరి పేర్లు మాత్రమే ఈ రాష్ట్రంలో ఉండాలని భావిస్తే అటువంటి వారికి తగిన గుణపాఠం చెప్పడం తప్పదన్నారు. కార్యక్రమంలో నాయకులు గుండా వెంకటేశ్వర్, శంకరయ్య, గుండా ప్రమోద్, ఎకరాల శ్రీనివాస్, పాపిని శంకర్, పల్లెర్ల శ్రీనివాస్, పాత శ్రీనివాస్, ముక్క కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించడం హర్షణీయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



తెలంగాణ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించడం హర్షణీయమని ఎన్ఎస్‌యూఐ నాయకులు కపిల్ అన్నారు. ఆదివారం పట్టణంలోని లైబ్రరీలో పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులతో కలిసి ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తు సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు తినిపించుకుంటూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటి సీఎం భట్టి విక్రమార్కకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ నాయకులు కపిల్ మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు రేవంత్‌రెడ్డి నిరుద్యోగులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత అసెంబ్లీ సాక్షిగా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేశారన్నారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలలో సాంకేతిక విద్యను అందించేందుకు ఉచిత కరెంట్‌ను ఇస్తున్నారని తెలిపారు. నిరుద్యోగులు, విద్యార్థుల పక్షాన ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవడం పట్ల ధన్యవాదాలు తెలిపారు.

9న చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బోథ్

ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా చలో హైదారాబాద్‌ను విజయవంతం చేయలని తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కుమ్రం భీమ్ విగ్రహం ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మండల, జిల్లా కేంద్రాలతో పాటు అధిక సంఖ్యలో ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలతో కూడిన ప్రదర్శనతో హైదరబాద్‌లో జరిగే కార్యక్రమాలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. రాజ్యాంగంలో పొందుపరిచ్చినట్లు 1950 ప్రకారం ఎస్‌టీలోని 9 ఉప తెగలకు రిజర్వేషన్ కల్పించాలని, 5వ షెడ్యూల్డ్ ప్రాంతానికి కాపాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న ఆదివాసుల యాసబాస ప్రకారం ప్రత్యేక కోడ్‌ను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ డివిజన్ అధ్యక్షులు దుర్వ విశ్వేశవర్, సార్మేడిలు అడెం భీమ్‌రావు, మాడవి గంగారాం, తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు రామెల్లి భోజన్న, తుడుం దెబ్బ సోనాలా అధ్యక్షులు జగ్నక్ మారుతి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగానికి విరుద్ధం



నవతెలంగాణ-ఉట్నూర్

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందని బహుజన సంఘాల జేఏసీ అధ్యక్షుడు సుభాష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రెస్ భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ విరుద్ధంగా ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేపట్టరాదని, ఒక్క వర్గానికి న్యాయం జరిగేలా చేసి మిగితా వర్గాలకు అన్యాయం చేయకూడదన్నారు. సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తున్నామన్నారు. 8 నుండి 10 వరకు మూడు రోజులు పాటు ఢిల్లీలో మహా ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. 21న భారత్ బంద్‌కు పిలుపునిస్తున్నామన్నారు. సమావేశంలో కాంబ్లె ప్రజ్ఞశీల్, కోడి బలవంత, మహేందర్, నారాయణ్, కేశవ్, ఆకాశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో చోరీ

నవతెలంగాణ-ఇచ్చోడ

మండలంలోని అడేగామ (కె)గ్రామ పంచాయతీ పరిధిలోని మద్యం దుకాణంలో శనివారం అర్ధరాత్రి ఇద్దరు దుండగులు దుకాణం షెట్టర్ పగలకొట్టి వైన్స్ లోపలికి వెళ్లి మద్యం బాటిళ్లు, కౌంటర్‌లో ఉన్న డబ్బులు తీసుకు వెళ్లారని వైన్స్ యజమాని తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సీసీ కెమెరాలను పరిశీలించారు.

రోడ్డు బాగు చేయాలని రాస్తా రోకో



నవతెలంగాణ-బోథ్

మండలంలోని గుట్ట పక్క తండా గ్రామానికి రోడ్డు బాగు చేయాలని ఆదివారం గ్రామస్తులు అంతర్‌రాష్ట్ర రహదారిపై రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో రోడ్డు గుంతలుగా ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు కావడంతో వర్షంతో గుంతలో నీరు నిల్వ ఉండటంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రోడ్డుపై దాదాపు గంట సేపు ధర్నా చేయడంతో రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సంఘటనను తెలుసుకున్న ఎస్సై రాము ఆందోళనకారులతో మాట్లాడారు. అనంతరం ఎంపీడీఓ హామీ మేరకు రాస్తారోకో విరమించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఉన్నారు.

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే



నవతెలంగాణ-ఉట్నూర్

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్టార్ పంక్షన్ హల్లో పవార్ దేవ్‌సింగ్ ప్రధానోపాధ్యాయుడి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందుతున్న ఉపాధ్యాయులు దేవ్‌సింగ్‌కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించడానికి ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. ఉపాధ్యాయులు లేనిది దేశం లేదని, విద్యార్థులు వారు సూచించిన మార్గాలను అనుసరిస్తే సులువుగా ఉన్నత స్థాయికి ఎదుగుతారని అన్నారు. అనంతరం ఐటీఐ కళాశాల భవనం కోసం భూమిపూజ చేశారు. ఖానాపూర్ నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డుపై విరిగిపడిన చెట్టు



నవతెలంగాణ-కడెం

మండలంలోని ఉట్నూర్ చౌరస్తా నిర్మల్ మంచిర్యాల ప్రధాన రహదారిపై భారీ టేకు వృక్షం నేలకొరిగింది. దీంతో ఆదివారం నిర్మల్, మంచిర్యాలకు రాకపోకలకు రెండు గంటల పాటు అంతరాయం ఏర్పడింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై భారీ వృక్షం పడటంతో పాటు పలు చోట్ల చెట్ల కొమ్మలు రోడ్డుపై పడ్డాయి. విషయం తెలుసుకున్న కడెం పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని రోడ్డుకు అడ్డంగా పడ్డ వృక్షాన్ని తొలగించేందుకు చర్యలు చేపట్టి, రాకపోకలను పునరుద్ధరించారు.

అలంకారమే... ఆడింది శూన్యమే..!

- అక్కరకు రాని క్రీడాస్థలాలు, పరికరాలు
- గ్రామాలకు ఆమడ దూరంలో మైదానాలు
- వృథా అవుతున్న రూ.లక్షల ప్రజాధనం

గ్రామీణ యువతలో క్రీడానైపుణ్యతను ప్రొత్సహించాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలు అలంకారప్రాయంగా మారాయి. లక్షల రూపాయాల నిధులు ఖర్చు చేసి నిర్మించినా క్రీడామైదానాలు నిరూపయోగంగా మారిపోయాయి. ప్రజాప్రతినిధులు, అధికారులకు ఖర్చులకు నిధులుగా మారాయి తప్పితే వాటివల్ల ప్రయోజనం కనిపించని దుస్థితి గ్రామాల్లో నెలకొంది'.



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

గ్రామీణ యువత క్రీడల్లో రాణించేందుకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కో గ్రామానికి ఒక క్రీడాప్రాంగణాన్ని ఏర్పాటు చేసింది. అందుకు అవసరమైన నిధులను జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా సమకూర్చింది. కాని ఈ మైదానాల వల్ల ఎవరికీ లబ్ధిచేకూరని పరిస్థితి నెలకొంది. కొన్ని గ్రామపంచాయతీల్లో బోర్డులు ఏర్పాటు చేసి మమ అనిపించారు. మరికొన్ని గ్రామాల్లో క్రీడామైదానాల్లో ఒక్కరోజు కూడా ఆడిన దాఖలాలు లేవు. కేవలం అలంకారప్రాయంగా మారాయి. మండలంలో 34 గ్రామపంచాయతీలుండగా అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ఒక్కో గ్రామ



పంచాయతీకి రూ.50 వేల చొప్పున నిధులు, 20గుంటల స్థలంలో క్రీడాప్రాంగణాలను నిర్మించారు. కొన్ని గ్రామాల్లో స్థలం లేని కారణంగా, 10 గుంటల స్థలంలో ఏర్పాటు చేశారు. కొందరు సర్పంచులు స్థలాన్ని చదును చేసే క్రమంలో జీపీ నిధులతో క్రీడాప్రాంగణానికి అధిక మొత్తంలోనూ నిధులు ఖర్చు చేశారు. వీటిలో వ్యాయామానికి రెండు పోల్స్, రెండు వాలీబాల్ పోల్స్ వేయాల్సి ఉండగా వ్యాయమానికి సంబంధించిన పోల్స్ తప్ప వాలీబాల్‌కు సంబంధించిన పోల్స్ ఎక్కడ కూడా కనిపించడం లేదు. మండల పరిధిలోని క్రీడా ప్రాంగాలు ఒకటి, అర తప్పితే ఏ ఒక్క గ్రామ పంచాయతీ పరిధిలో ఉపయోగకరంగా నిర్మించిన దాఖలాలు లేవు. గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయడంతో అవి ఎక్కడున్నాయో కూడా తెలియని పరిస్థి నెలకొంది. దీంతో అవి అలంకారప్రాయంగా ఉన్నాయి. ప్రజాధనం నిష్ప్రయోజనంగా మారింది.

దగ్గరగా ఉంటే ప్రయోజనం



- గంగన్న, మావల

క్రీడాప్రాంగణాలు గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయడంవల్ల ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. క్రీడా స్థలం గ్రామంలో ఉంటే ఉదయం వ్యాయమాలు చేసేందుకు, క్రీడలు ఆడుకునేందుకు క్రీడాకారులకు ఉపయోగకరంగా ఉంటుంది. తక్కువ స్థలంలోనైనా గ్రామంలో క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేయాలి.

హామీల అమలుకు సమరశీల పోరాటాలను నిర్వహిస్తాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



గత ఎన్నికల ముందు రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు చేపట్టిన సమ్మెల సందర్భంగా గత ప్రభుత్వం నాటి కాంగ్రెస్ నాయకత్వం ఇచ్చిన హామీలను మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని హామీల అమలుకు సమరశీల పోరాటాలను నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో జిల్లా ప్రతినిధిగా హాజరై మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులకు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు, మధ్యాహ్నం భోజన కార్మికులకు, ఐకేపీ సిబ్బందికి రూ.26వేల కనీస వేతనం అందించాలని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో కార్మికులను ఐక్యం చేసి, సమరశీల పోరాటాలను నిర్వహిస్తామని అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎన్నికల మేనిఫెస్టోలో కార్మికోద్యోగులకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని అన్నారు. కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. గత ప్రభుత్వంలో కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని ఆరోపించారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, టైం స్కేల్, డైలీ వేజ్ కార్మికుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయన్నారు. ఈ ప్రభుత్వమైనా కార్మిక ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న కోశాధికారి, కే.సునీత పాల్గొన్నారు.

30 ఏండ్ల పోరాటానికి ముగింపు సుప్రీం తీర్పు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం 30 సంవత్సరాలుగా దేశంలో జరుగుతున్న పోరాటానికి సుప్రీంకోర్టు న్యాయమైన ముగింపునిచ్చిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అరెల్లి మల్లేష్ మాదిగ అన్నారు. ఆదివారం పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం ఎదుట పెద్ద ఎత్తున నినాదాలతో టపాసులను పేల్చి మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం కేక్‌కట్ చేసి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా మల్లేష్ మాదిగ మాట్లాడుతూ దండోరా ఉద్యమ 30 ఏండ్ల కల వర్గీకరణ అని, వర్గీకరణ లేక విద్య, ఉద్యోగ రంగాలలో మాదిగలు, ఉప కులాలకు ఇప్పటి వరకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో అంబేద్కర్ ఇచ్చిన రిజర్వేషన్ల ఫలాలకు సార్థకత దక్కుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం మాదిగలకు ఉపకులాలకు రావలసిన రిజర్వేషన్ల శాతాన్ని కేటాయించి వర్గీకరణ అమలు చేయాలని, ఇప్పటివరకు ఇచ్చిన నోటిఫికేషన్‌లలో రిజర్వేషన్ల వర్గీకరణ అమలు చేయాలని, దానికోసం అవసరమైతే ఆర్డినెన్స్‌ను తీసుకురావాలని సీఎంను కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఇంద్ల ఎల్లన్న మాదిగ, సందూరి వినే య్ సాగర్ మాదిగ, టౌన్ నాయకులు టౌన్ నాయకులు మోడిపల్లి మనోజ్ మాదిగ, ఆరెపల్లి గణేష్ మాదిగ, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మానాల శేఖర్ మాదిగ, రాకేష్, వెంకటేష్ ప్రణయ్ వికాస్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : మండలంలోని చాందా(టి) గ్రామంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎస్సీల వర్గీకరణపై సుప్రీం తీర్పును హర్షిస్తూ మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో గ్రామ మాదిగ యువకులు పాల్గొన్నారు.

లోకేశ్వరం : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పునివ్వడంతో ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మండల కేంద్రంలో డప్పు చప్పుళ్లతో ఊరేగింపు నిర్వహించి ప్రధాని మోడీ, మంద కృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణకు 30 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటం చేశారన్నారు. ఎన్నో అవమానాలను తట్టుకొని, పట్టుదలతో వర్గీకరణ కోసం బాటలు వేశారని అన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్‌ను స్థాపించి మాదిగలకు ఉపకులాల హక్కులకై ఎన్నో పోరాటాలు చేసిన ఉద్యమ నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో శంకర్, భోజన్న, లక్ష్మణ్, గణేష్, అశోక్, మోహన్, రవి, శ్రీకాంత్, అజయ్, సురేష్, నగేష్, మహేష్, రాజు, శ్యామ్, లక్ష్మణ్, తేజ, వినోద్ పాల్గొన్నారు.

లోకేశ్వరం



ఆదిలాబాద్ రూరల్



మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో



నవతెలంగాణ-తలమడుగు

ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. దానిని వెనక్కి తీసుకోవాలంటూ ఆదివారం మండల కేంద్రంలోని డా.బిఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మాల సంఘం నాయకులు మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టడమేనని సంవత్సరాలుగా అన్నద మూలవలె కలిసి ఉన్న వారిని విడగొట్టి వర్గీకరణ చేయడం సమంజసం కాదంటూ తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును వెంటనే వెనక్కి తీసుకొని రాష్ట్రాలకు ఇచ్చిన అధికారాలను అమలు చేయకుండా ఉండాలన్నారు. గతంలో ఇచ్చిన రిజర్వేషన్లు చెల్లదని క్లుప్తంగా వివరించినప్పటికీ ఆరు, ఏడు కమిటీ సభ్యులంటూ వర్గీకరణ చేయడం రాజ్యాంగ విరుద్ధమంటూ మండిపడ్డారు. వర్గీకరణ వెనక్కి తీసుకొని పక్షంలో మాలలు కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని తెలిపారు. ఓటు బ్యాంకు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని గౌరవించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సుప్రీం కోర్టు మరోసారి ఆలోచించి దళితుల్లో చిచ్చు పెట్టకుండా ఉద్యోగ, ఉపాధి, రిజర్వేషన్లు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాస్తా రోకో కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం నాయకులు క్రాంతి కుమార్, భూత దేవన్న, శ్రీనివాస్, గంగన్న, ఆనంద్, దేవన్న, రాకేష్, నర్సింగ్, రావుల నారాయణ, ఇస్తారి, వసంత్, రాజేశ్వర్, గజానంద్, రాములు, సచిన్, చినబాపూ, దేవిదాస్, అడెల్లు, చంటి పలువురు మాల సంక్షేమ సంఘం నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి



నవతెలంగాణ-నిర్మల్

ప్రయివేటు ఉపాధ్యాయుల మనోభావాలను కించపరుస్తూ మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని నిర్మల్ జిల్లా ప్రయివేట్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇంటర్, డిగ్రీ తప్పిన వారు, అర్హతలేని వారు ప్రయివేట్ పాఠశాలలో విద్యను బోధించడం అనే మాటలు సీఎం మాట్లాడటం చాలా బాధాకరమని అన్నారు. అన్ని అర్హతలు ఉండి ప్రభుత్వ నిర్వాకంతో నోటిఫికేషన్ లేక ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో చాలీచాలని వేతనాలతో ప్రయివేట్ సంస్థలో పనిచేస్తున్నామని అన్నారు. ప్రయివేటు ఉపాధ్యాయులకు చాలీచాలని వేతనాలు ఉన్న కానీ, జ్ఞానం ఎక్కువేనని మరిచిపోవద్దన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉపాధ్యాయుల పిల్లలు ప్రయివేటు బడిలో చదువుతున్న వారేనని తెలిపారు. సీఎం తన వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవడంతో పాటు ప్రయివేటు ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రయివేటు ఉపాధ్యాయులపై సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణలను చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రయివేట్ ఉపాధ్యాయుల కమిటీ సభ్యులు హరీష్, రాంప్రసాద్, పండరినాథ్, శ్రీనివాస్, విజయ్, శివ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్ఫలితాలు అందుకుంటున్న విద్యార్థులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాణ్యమైన విద్యతో పాటు ఉద్యోగ నోటిఫికేషన్లు అందించడంతోనే ఆ సత్ఫలితాలను నేడు విద్యార్థులు అందుకోగలుగుతున్నారని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన గోస్కుల విజయ ఏఈఈ ఫలితాల్లో సత్తా చాటి మిషన్ భగీరథ డిపార్ట్‌మెంట్‌లో ప్రభుత్వ ఉద్యోగం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం తిలక్ నగర్‌లోని వారి నివాసానికి మాజీ మంత్రి జోగు రామన్న వెళ్లి విద్యార్థిని విజయతో పాటు వారి తల్లిదండ్రులు రవీందర్ సంగీతలను శాలువాతో ఘనంగా సత్కరించి పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 2022-23లో వచ్చిన నోటిఫికేషన్‌లో ఉద్యోగం సాధించిందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మెరుగైనా విద్యను అందిస్తూ, ఉద్యోగాల నోటిఫికేషన్ అందించడం ద్వారా నేడు విద్యార్థులు సత్ఫలితాలను ఇప్పుడు అందుకోవడం జరుగుతుందని ఆనందం వ్యక్తం చేశారు. అలాగే విద్యపై ప్రతి ఒక్కరూ పట్టు సాధించినట్లయితే ఇలాంటి మరెన్నో విజయాలను అందిపుచ్చుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్, వార్డ్ కౌన్సిలర్ కొండ గణేష్, నల్ల మహేందర్, సంజయ్, కోవ రవి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఏజెన్సీ చట్టాలను అమలు చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఏజన్సీలో చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని లంబాడా జేఏసీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్ అన్నారు. పట్టణంలోని గిరిజన భవనంలో ఆదివారం లంబాడా జేఏసీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో ఉన్న అన్ని రకాల జీఓలను పకడ్బందీగా అమలు చేయాలని, 317 జీఓను రద్దు చేసి, ఉపాధ్యాయుల బదిలీ భార్య, భర్తలు ఒకే మండలంలో ఉండే విధంగా ప్రభుత్వం చూడాలని కోరారు. ఈ సమావేశంలో లంబాడా జేఏసీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సలహాదారులు, మాజీ ఎంపీటీసీ జాదవ్ గోపాల్‌రావు, శేషేరావు, బానోత్ రామారావు, రెడ్డి నాయక్, సుధాకర్ నాయక్, గంగారాం నాయక్, రాజేష్, సుమేష్, విజేస్, గణేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమ్మదగిన తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | 05 ఆగస్టు, 2024 | www.navatelangana.com

అక్రమ ఇసుక పట్టివేత

నవతెలంగాణ-వాంకిడి



జిల్లా నుండి మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా జివితికి అక్రమంగా తరలిస్తున్న ఇసుక డీసీఎం వ్యాన్ టాస్క్ ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్, ఎస్సై గంగన్న సిబ్బందితో కలిసి టోల్ ప్లాజా వద్ద పట్టుకున్నారు. ఈ సందర్భంగా వాహనాన్ని అదుపులోకి తీసుకొని డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమ ఇసుక రవాణా జరిగితే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పీసీలు సంజీవ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

నవతెలంగాణ-దహెగాం



మండల కేంద్రం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కొంచవెల్లి గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి చౌదరి నవీన్ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం కాగజ్‌నగర్ నుండి కొంచవెల్లికి ద్విచక్ర వాహనంపై గ్రామానికి చెందిన సూరజ్‌తో కలిసి వస్తున్న క్రమంలో దహెగాం సమీపంలోని మల్లన్న ఒర్రె వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న ద్విచక్ర వాహనంను ఢీ కొనడంతో నవీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతన్ని కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు పేర్కొన్నారు. సంఘటన స్థలానికి ఎస్సై రాజు చేరుకుని కేసును దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థి మృతితో కొంచవెల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బీజేపీ ఫాసిస్టు విధానాలను తిప్పికొట్టాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీజేపీ ఫాసిస్టు విధానాలను తిప్పి కొట్టాలని సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఆసిఫాబాద్ జిల్లా రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ మతం పేరుతో చేసే హత్యా రాజకీయాలను తిప్పికొట్టాలని, కుమురం భీం జిల్లా లాంటి ఏజెన్సీ ప్రాంతాల్లో చేప కింద నీరులా విస్తరిస్తుందని దానిని నిలువరించాలన్నారు. రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కి, ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాస్తుందన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామని పదేపదే చెప్పిన బీజేపీకి పార్లమెంట్ ఎన్నికలలో దేశ ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. రాజ్యాంగం స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని అమలుచేయాలని బీజేపీ చూస్తుందన్నారు. మనుధర్మ శాస్త్రం ప్రకారం దేశంలో ఉన్న నిమ్న కులాల ప్రజలు అంటరానివారుగా, దేశ అభివృద్ధి ఫలాలకు దూరంగా ఉండాలి, స్త్రీలకు కనీస స్వేచ్ఛ లేకుండా వారిని రెండవ తరగతి పౌరులుగా స్థిరపర్చే కుట్ర దాగి ఉందని, బ్రాహ్మణ ఆధిపత్యంలో దేశం ఉంటుందన్నారు. దేశాన్ని మత రాజ్యంగా మార్చే కుట్రలో భాగంగా అధికారాన్ని పావుగా వాడుకుంటున్నారని, దాని అంతిమ లక్ష్యం హిందూ మత రాజ్యం ఏర్పాటు చెయ్యడమేనన్నారు. రాజ్యాంగ హక్కులను కాలరాసే బీజేపీ ఫాసిస్టు విధానాలను తిప్పికొట్టే కర్తవ్యాన్ని సీపీఐ(ఎం) పార్టీగా ప్రతి సభ్యుడు బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్ కుమార్, గుడిసెల కార్తీక్, రాజ్ కుమార్, నాయకులు మాలశ్రీ, శంకరమ్మ, కమల పాల్గొన్నారు.

సుప్రీం తీర్పుతో మాదిగ ఉప కులాలకు సమన్యాయం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వల్ల మాదిగ ఉప కులాలకు సమ న్యాయం జరగనుందని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని రాజీవ్‌చౌరస్తా నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి మాదిగ, ఉప కులాలకు అన్యాయం జరుగుతూ వస్తోందని, దీనిని కళ్లకు కట్టినట్లు తమ వాదనను న్యాయవాదులు వినిపించి తమకు న్యాయం చేశారన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజులలో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మరెన్నో సామాజిక ఉద్యమాలకు సిద్ధం కావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రేగుంట కేశవరావు మాదిగ, జలంపల్లి శ్రీనివాస్, పంబాల రమేష్, అంబాల ఓదేలు, ఈర్ల సునీల్, గోగర్ల కన్నయ్య పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ వేడుకలు



నవతెలంగాణ-కౌటాల

ఆషాఢ బోనాల సందర్భంగా మండల కేంద్రంలోని కంకాలమ్మ గుట్టపై వెలిసిన కంకాలమ్మ కేతేశ్వర స్వామిని అమ్మవారిని సిర్పూర్ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో రావి, మర్రిచెట్టును నాటి నీరుపోశారు. మండల కేంద్రంలోని రామాలయం నుండి శివసత్తులు బోనం ఎత్తుకొని ప్రదర్శించిన నృత్యాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. బోనాలతో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య అధ్వర్యంలో మూడు వందల ఒక్క కంక చెట్లను నాటారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సుల్వ కనకయ్య, బీజేపీ మండల అధ్యక్షులు నరులేవాను పటేల్, జిల్లా కార్యదర్శి బండి రాజేందర్ గౌడ్, మాజీ జడ్పీటీసీ ఎల్మలే మల్లయ్య, మాజీ ఎంపీటీసీ దుర్గం మోతిరాం, కుంచాల సత్తయ్య, బండురావు, సత్పుతే తుకారాం, భూమయ్య, మేకల తిరుపతి, శంకర్, బాబురావు, రవి, మధుకర్, వెంకటేష్, సునీల్ చౌదరి, సాయి, శ్రీను, రామయ్య బ్రహ్మయ్య, తిరుపతి, భక్తులు ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్వచ్ఛదనం పచ్చదనం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేటి నుండి ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపాలిటీ కమిషనర్ భుజంగరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఆర్ కాలనీలో ప్రారంభించనున్నట్లు ఈనెల 9వ తేదీ వరకు అన్ని కాలనీలో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అధికారులు, ప్రజలు సహకరించి ప్రభుత్వ కార్యక్రమానికి విజయవంతానికి సహకరించాలని కోరారు.

అడుక్కో గుంత..ప్రమాదపు చింత..!

- అధ్వాన్నంగా మారిన జాతీయ రహదారి
- టోలు వసూలు చేస్తున్నా.. కరువైన మరమ్మత్తులు
- పట్టించుకోని అధికారులు పరేషాన్‌లో ప్రజలు



జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలు



జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో పూర్తయిన హైవే సంవత్సరం కాకముందే అద్వానంగా తయారై వాహన చోదకులకు ఇబ్బందిగా మారింది. జిల్లా గుండా 50 కిలోమీటర్ల దూరం ఉన్న జాతీయ రహదారి గుంతలతో ప్రమాదకరంగా మారింది. అడుక్కోగుంత ఉండటంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు.

నేషనల్ హైవే అధ్వాన్నం

2019లో మంచిర్యాల జిల్లాలోని రేపల్లెవాడ నుండి జిల్లా సరిహద్దు వరకు జిల్లా కేంద్రాన్ని కలుపుతూ రూ.1100 కోట్లతో హైవే నిర్మాణానికి పునాదిరాళ్ల వేశారు. 2023లో హైవే పూర్తిగా నిర్మాణం జరిగి అందుబాటులోకి వచ్చింది. హైవే నిర్మాణం పూర్తయి సంవత్సరం కూడా కాకముందే ఎక్కడికక్కడ గుంతలు పడి అధ్వానంగా తయారైంది. ఇప్పటికే వాంకిడి సరిహద్దులో బ్రిడ్జి కుంగిపోగా ఆ రోడ్డు గుండా వాహనాలు రాకపోకలు కూడా నిలిపివేశారు. అయితే పలుచోట్ల గుంతలు పడ్డ రోడ్డుపై సిగ్నల్ ఏర్పాటు చేయాల్సిన హైవే అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

టోలు వసూలు చేస్తున్నా మరమ్మతులు లేవు

నేషనల్ హైవే నిర్మాణం ప్రభుత్వ, ప్రైయివేటు భాగస్వామ్యంతో పూర్తి చేసుకుని గుత్తేదారు వాంకిడి మండలంలో బెండర వద్ద టోల్ ప్లాజా ఏర్పాటు చేశారు. ఇతర టోల్ ప్లాజాతో పోల్చినట్లయితే బెండరాలో వాహనాలకు అధికంగా టోల్ చార్జీలు వసూలు చేస్తున్నారు. టోల్ ప్లాజా వద్ద చార్జీలు వసూలు చేసినన్ని రోజులు రోడ్డు మరమ్మతులు చేయాల్సిన బాధ్యత గుత్తేదారుపై ఉంటుంది. కానీ గుత్తేదారు కనీస మరమ్మతులు కూడా చేయకపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులు రోజురోజుకు పెరుగుతున్నాయి.

పట్టించుకోని అధికారులు పరేషాన్‌లో ప్రజలు

నేషనల్ హైవేపై ప్రతిరోజు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయాణిస్తూ ఉంటారు. వీరితో పాటు నేషనల్ హైవే పెట్రోలింగ్ టీం కూడా తిరుగుతోంది. అయిన కనీసం పట్టించుకోకపోవడంతో గుంతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. సాధారణ వర్షాలకు పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజుల్లో రోడ్డు పరిస్థితి ఇంకెలా ఉండబోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కనీసం మరమ్మత్తులపై పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మరమ్మతులు చేసి ప్రజల కష్టాలు తీర్చాలి

వినాయక్, స్థానికుడు



హైవేపై గుంతలు ఎక్కువ కావడంతో ప్రయాణం ఇబ్బందిగా మారుతోంది. రాత్రిపూట గుంతలో వాహనం పడితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వెంటనే మరమ్మతులు చేసి ప్రజల కష్టాలు తీర్చాలి.

గుత్తేదారు మరమ్మతులు చేయకుంటే ఆందోళనలు

దుర్గం దినకర్, కేవీపీఎస్ జిల్లా నాయకుడు



హైవే అధికారుల నిర్లక్ష్యంతో జిల్లా గుండా వెళ్లే రహదారి పూర్తిగా గుంతల మయంగా మారింది. ప్రమాదాలు జరగకముందు వెంటనే స్పందించి అధికారులు మరమ్మతులు చేయాలి. లేకుంటే రానున్న రోజుల్లో ప్రజలతో కలిసి ఆందోళన చేస్తాం. టోల్ ప్లాజా ఏర్పాటు చేసిన అధికారులు మరమ్మతులపై దృష్టి సారించకపోవడం దారుణం.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు

నవతెలంగాణ-కౌటాల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్‌బాబు

శాసనసభలో సిర్పూర్ నియోజకవర్గ సమస్యలతో పాటు రాష్ట్రంలోని అనేక సమస్యలను ప్రస్తావించానని ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గ సమస్యలను ప్రభుత్వం దృష్టికి శాసనసభ ద్వారా తీసుకురావడం జరిగిందన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీలు భర్తీ చేయాలని, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీలో సిబ్బందిని నియమించాలని ప్రస్తవించామన్నారు. సాగునీటి రంగంపై చర్చలో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టు నిర్మించాలని, ఈ బడ్జెట్‌లో కేటాయించిన రూ.250 కోట్లు ఏ మూలకు సరిపోవని చెప్పామన్నారు. ప్రతి మండల కేంద్రంలో ఒక మినీ స్టేడియం ఏర్పాటుతో పాటు కాగజ్‌నగర్ పట్టణంలోని స్కిల్ యూనివర్సిటీ శాఖను ఏర్పాటు చేయాలని కోరడం జరిగిందన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా చర్చ జరగాలని, అలాగే శాసనసభ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశామన్నారు. సిర్పూర్ నియోజకవర్గ ప్రతినిధిగా అసెంబ్లీలో గళం విప్పే అవకాశం కల్పించిన సిర్పూర్ నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేస్తూ, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే క్రమంలో ఎప్పుడూ ముందు ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు నరులే వాను పటేల్, జిల్లా కార్యదర్శి బండి రాజేందర్ గౌడ్, మాజీ జడ్పీటీసీ ఎల్మలే మల్లయ్య, మాజీ ఎంపీటీసీ దుర్గం మోతిరాం, కుంచాల సత్తయ్య, బండురావు, సత్పుతే తుకారాం, భూమయ్య, మేకల తిరుపతి, శంకర్, బాబురావు, రవి, మధుకర్, చందు, వెంకటేష్, సునీల్ చౌదరి సాయి, శ్రీను, రామయ్య, బ్రహ్మయ్య, తిరుపతి పాల్గొన్నారు.

గ్రామానికో..జేఆర్ఓ..!

- పంచాయతీలకు జూనియర్ రెవెన్యూ అధికారులు
- గతంలో పనిచేసిన వీఆర్ఏ, వీఆర్ఓలకు ప్రాధాన్యం
- సీసీఎల్ఏ ప్రతిపాదనలు.. సర్కారు నిర్ణయమే తరువాయి



కెరమెరి రెవెన్యూ గ్రామం

నవతెలంగాణ-కెరమెరి

గ్రామస్థాయి రెవెన్యూ వ్యవస్థను బలపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. రెవెన్యూ గ్రామాలకు ఒక జూనియర్ రెవెన్యూ అధికారిని(జేఆర్ఓ)ను నియమించాలని భావిస్తోంది. 2021 అక్టోబర్‌కు ముందు రాష్ట్రంలో గ్రామస్థాయిలో రెవెన్యూ సేవలు అందించేందుకు గ్రామ రెవెన్యూ అధికారులు(వీఆర్ఓలు), గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏలు) ఉండేవారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా సుమారు 103 మంది వీఆర్ఓలు, 317 మంది వీఆర్ఏలు పనిచేస్తుండేవారు. గత ప్రభుత్వం వీఆర్ఓ, వీఆర్ఏ వ్యవస్థలను పూర్తిగా రద్దు చేసింది. వారిని ఇతర శాఖలకు బదలాయించింది. దీంతో గ్రామస్థాయిలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నట్టు కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించింది. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రెవెన్యూ శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయిలో రెవెన్యూ సిబ్బంది నియామకానికి వారు పచ్చ జెండా ఊపినట్టు సమాచారం. రెవెన్యూ గ్రామానికి ఒక జేఆర్ఓ నియమించాలని ఈ శాఖ ప్రతిపాదిస్తుంది. జూనియర్ రెవెన్యూ అధికారి లేదా గ్రామ రెవెన్యూ కార్యదర్శి పేరు పెట్టేందుకు సిఫారసు చేసింది. జిల్లాలో 434 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. డిగ్రీ లేదా సమానమైన విద్యార్హత ఉన్న వారిని ఈ పోస్టుకు తీసుకోవాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ సీసీఎల్ఏ నుంచి రెవెన్యూ శాఖకు ప్రతిపాదనలు అందినట్లు సమాచారం.

అర్థిక భారం లేకుండా పాతవారితోనే

జేఆర్ఓ పోస్టుల్లో గతంలో పనిచేసిన వీఆర్ఓ, వీఆర్ఏలను నియమించనున్నారు. దీనివల్ల ప్రభుత్వంపై ఎటువంటి ఆర్థిక భారం, కొత్తగా నియామక ప్రక్రియ కూడా ఉండదని సీసీఎల్ఏ ప్రభుత్వానికి ఇచ్చిన ప్రతిపాదనలు తెలిపినట్లు తెలిసింది. నాడు వారిని ఇతర శాఖలకు బదలాయించిన అక్కడ వారి సర్దుబాటు విజయవంతం కాలేదని వివరించినట్లు సమాచారం. మరికొన్ని శాఖల్లో వారికి వేతనాలు కూడా అందని పరిస్థితి ఉంది. గతంలో 5195 మంది వీఆర్ఓలు, 20555 మంది వీఆర్ఏలను ఇతర శాఖలకు బదలాయించారు. వారిలో డిగ్రీ ఉత్తీర్ణులైన వారికి జేఆర్ఓ పోస్టులో ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. గ్రామ రెవెన్యూ వ్యవస్థను తిరిగి తీసుకొస్తేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వీలుంటుందని తెలంగాణ రెవెన్యూ అధికారుల సంఘం తెలిపింది.

జేఆర్ఓ ఉద్యోగ విధులు

ప్రభుత్వ భూముల రక్షణ, చెరువుల నీటి వనరులు, చెట్ల పరిరక్షణ, భూ సంబంధిత వ్యవహారాల్లో క్షేత్రస్థాయి విచారణలు. అన్ని రకాల ధ్రువపత్రాలకు సంబంధించి విచారణలు. ప్రభుత్వ పథకాలు అభివృద్ధి కార్యక్రమాల్లో అర్హుల గుర్తింపు, భూ సర్వేకు సహాయకారిగా ఉండడం. విపత్తులు ఇతర అత్యవసర సేవల్లో తోడ్పాటు. అన్ని రకాల ఎన్నికల సంబంధిత విధులు ప్రోటోకాల్ అధికారులకు సహాయకారులుగా బాధ్యత. జిల్లా, మండల, క్లస్టర్ గ్రామస్థాయిలో ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ సహాయకారిగా వ్యవహరించడం.

బాధ్యత స్వీకరించిన స్పెషల్ ఆఫీసర్

నవతెలంగాణ-సిర్పూర్(టి)



సిర్పూర్(టి) మేజర్ గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా ఎంపీడీఓ పి. సత్యనారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం సందర్భంగా నేడు ఉదయం 9:30కు గ్రామపంచాయతీ కార్యాలయం సిర్పూర్(టి) అవరణలో గ్రామసభ నిర్వహిస్తున్నట్లు, గ్రామస్తులు అందరు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ సెక్రెటరీ తిరుపతి, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ విద్యా సదస్సులో జిల్లా నాయకులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగుతున్న జాతీయ విద్యా సదస్సులో జిల్లా నాయకురాలు, ఎస్టీఎఫ్ఐ జనరల్ కౌన్సిల్ సభ్యులు వైద్య శాంతి కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పార్లమెంట్ సభ్యుడు అమరారం ఎస్సీఎస్ఐ నూతన భవనాన్ని ప్రారంభించినంతరం మాట్లాడుతూ ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. నూతన విద్యా విధానం పేరిట విద్యా ప్రైయివేటీకరణ సరైంది కాదన్నారు. కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న విద్యా విధాన వ్యతిరేక పోరాటం నూతన భవనం నుంచే ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా నాయకులు మాట్లాడుతూ పేదలకు విద్య అందాలంటే విద్య ప్రభుత్వ రంగంలోనే ఉండాలన్నారు. ఆన్‌లైన్ విధానంలో విద్య కేవలం కార్పొరేట్లకు మాత్రమే అందుతుందని, గ్రామీణ పేదలకు అందడం లేదన్నారు. కార్యక్రమంలో ఎస్టీఎఫ్ఐ రాష్ట్ర జాతీయ ఉపాధ్యక్షులు చావా రవి, సభ్యులు దుర్గ భవాని, జనరల్ కౌన్సిల్ సభ్యులు జంగయ్య పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు డి జనార్దన్ సూచించారు. సత్యసాయి సేవా సమితి కాగజ్‌నగర్ ఆధ్వర్యంలో 'ప్రేమ తరు' కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో 140 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్ల ప్రాధాన్యత గురించి ప్రతి ఒక్కరు తెలుసుకొని కనీసం ఒక మొక్క నాటితే రాబోయే తరాలకు మంచి భవిష్యత్తు అందించినవారమవుతామని అన్నారు. కార్యక్రమంలో సేవా సమితి జిల్లా యూత్ కో ఆర్డినేటర్ కొడిప్యాక సతీష్, కన్వీనర్ కె నాగేశ్వర్‌రావు, సమితి సభ్యులు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం



నవ తెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని వాసవి ఆలయంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్‌కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పూర్వ అధ్యక్షులుగా పనిచేసిన గుండా ప్రమోద్, గుండా వెంకటేశ్వర్లు, కొడిప్యాక వేణుగోపాల్, ఎకరాల శ్రీనివాస్, రావుల వెంకన్న, కొలిపాక వేణుగోపాల్, కొలిపాక రవి, తంగడపల్లి రమేష్ లను ఘనంగా సన్మానించారు. స్నేహితుల రోజుకు ఉన్న ఆవశ్యకత స్నేహితులతో తమకు జీవితంలో జరిగిన మంచి అనుభవాలను ఒకరికొకరు పంచుకున్నారు. వాసవి క్లబ్ కార్యక్రమాలను విజయవంతంగా చేస్తున్న అధ్యక్షుడు కొలిపాక శంకర్‌ను కేస్లాపూర్ హనుమాన్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు కొలిపాక శంకర్, సభ్యులు గోగుల శ్రీనివాస్, పిన్న వివేక్, గుండ బాలేష్, పాపిని శంకర్, ఇంటర్‌నేషనల్ వైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చిలువేరు వెంకన్న పాల్గొన్నారు.

ఘనంగా శ్రీచౌడేశ్వరి మాత జయంతి

నవతెలంగాణ-బెజ్జూరు

మండల కేంద్రంలో ఆదివారం దేవాంగ సంఘం ఆధ్వర్యంలో శ్రీ చౌడేశ్వరి అమ్మవారి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాంగ సంఘం గౌరవ అధ్యక్షులు బెనికి శ్యాంసుందర్, అధ్యక్షులు పొలాస శేఖర్, సభ్యులు నాగుల రవికుమార్, రాజమౌళి, బెగుడ చంద్రమౌళి, గోరంటల బాపు, చంద్రమౌళి, సాంబశివ్, మండిగ హేష్, పొలాస కేదారి, రాపెల్లి సమ్మన్న, బెనికి దామోదర్, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.



గురుకుల హాస్టల్‌లో విద్యార్థినికి విద్యుత్ షాక్



నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల పట్టణం గోదావరి రోడ్‌లో గల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళ డిగ్రీ కాలేజీలో ఓ విద్యార్థిని విద్యుత్ షాక్‌కు గురైంది. కాలేజ్‌లోని ఓ అధ్యాపకురాలి లాప్ టాప్ ఛార్జింగ్ పెట్టె క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి 7 గంటలకు విద్యుత్ షాకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ అధ్యాపకురాలు లాప్ టాప్ చార్జింగ్ పెట్టాలని వైష్ణవి అనే విద్యార్థినికి ఇవ్వగా ఈ క్రమంలో విద్యుత్ షాక్ కు గురైంది. హుటాహుటిన ఆ విద్యార్థినిని అధ్యాపకురాలు మంచిర్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం ఓ ప్రయివేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

వాణి నికేతన్ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-తాండూర్



స్నేహితుల దినోత్సవం సందర్భంగా తాండూర్ హైస్కూల్‌లో 2002-2003 సంవత్సరం పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులంతా ఏకమై స్థానిక వాని నికేతన్ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పై చదువులు చదివి వృత్తి ఉద్యోగాల్లో స్థిరపడ్డ స్నేహితులంతా ఒకచోట చేరి యోగక్షేమాల గురించి చర్చించుకున్నారు. 22 ఏళ్ల సుదూర ప్రయాణంలో కలుసుకున్న స్నేహితులు అనురాగం ఆప్యాయతల మధ్య రోజంతా కాలక్షేపం చేశారు. పిల్లల చదువుల గురించి ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక, ఆరోగ్య కుటుంబ సంక్షేమం గురించి ముచ్చటించుకున్నారు. పిల్లల కేరింతలు పెద్దల ఆనందోత్సాహాల మధ్య సమ్మేళనం నిర్వహించారు.

ఉద్యమాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారం



నవతెలంగాణ-నస్పూర్

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాట తప్ప మరో మార్గం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేని శంకర్ అన్నారు. ఆదివారం సీపీఐ నస్పూర్ మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశం నరసయ్య భవన్‌లో జోగుల మల్లయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు అల్లా లచ్చిరెడ్డి జెండా ఆవిష్కరించారు. అనంతరం కలవేని శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని, ప్రతి ఒక్కరూ సమస్యలపై పోరాటం చేయాలన్నారు. అర్హులైన వారికి ఫుడ్ సెక్యూరిటీ(రేషన్) కార్డులు, వృద్ధాప్య, వికలాంగుల, వితంతుల పింఛన్‌లు ఇవ్వాలని, అందరికీ గృహ జ్యోతి పథకం అమలయ్యేలా చూడాలని కోరారు.

మండల నూతన నిర్మాణ కమిటి

నస్పూర్ మండల నూతన నిర్మాణ కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా జోగుల మల్లయ్య, సహాయ కార్యదర్శిలుగా లింగం రవి, మొగిలి లక్ష్మణ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, కోశాధికారి మిరియాల రాజేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేగుంట చంద్రశేఖర్, కారుకురి నగేష్, వీరభద్రయ్య, బాజీ సైదా, కొట్టే కిషన్ రావు, దొడ్డిపట్ల రవీందర్, తంగళ్లపల్లి సురేష్, పూజారి రామన్న, కొత్త పెళ్లి మహేష్, ఏవిఎస్ శాస్త్రి పాల్గొన్నారు.

డ్రైవర్ అప్రమత్తతో తప్పిన ప్రమాదం



నవతెలంగాణ-వేమనపల్లి

చెన్నూరు నుంచి ముల్కలపేట వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆదివారం ముల్కలపేట సమీపంలో ప్రయాణికులతో వెళ్తున్న సమయంలో అదుపుతప్పింది. రోడ్డు దిగి వరి పొలాల్లోకి వెళ్లే సమయంలో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ రహదారి బీటీ రోడ్డు ఉన్నప్పటికీ వర్షాకాలంతో ట్రాక్టర్ కేజీ వీల్స్‌తో రోడ్డు మీద తిరగడం వల్ల వరి పొలాల్లోని మట్టి బురద అంత బీటీ రోడ్డుపైకి రావడం వల్ల బురద కారణంగానే బస్సు అదుపు తప్పింది. మండలంలోని రవాణా సౌకర్యం మెరుగుపడేందుకు రహదారుల నిర్మాణం దిశగా కృషి చేయాల్సిన పాలకుల అధికారులు నిర్లక్ష్య వైఖరి కారణంగానే మండలంలోని రహదారులు అధ్వానంగా ఉన్నాయి. కొత్త రహదారులు నిర్మాణానికి చర్యలు తీసుకోక పోవడంతో మండలంలోని ప్రయాణికులు ప్రమాదకరంగా ఉన్న రోడ్లపై తప్పనిసరి పరిస్థితిలో ప్రయాణిస్తున్నారు. సగానికి పైన గ్రామాలకు నేటికీ మట్టి రోడ్లు ఉన్నాయి. అవి వర్షకాలంలో బురదమయంగా తయారవడంతో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాధికారులు స్పందించి మండలంలోని రహదారులు నిర్మించి రవాణా సౌకర్యం కల్పించాలని, బీటీ రోడ్లపై క్రేజీ వీల్స్ తిరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సెల్ ఫోన్ పోతే ఆందోళన వద్దు



నవతెలంగాణ-మందమర్రి

సెల్ ఫోన్ పోతే ఆందోళన వద్దని మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఒకేరోజు నాలుగు ఫోన్లను మందమర్రి పోలీసులు రికవరీ చేశారు. ఫోన్ల రికవరీలో ప్రముఖ పాత్ర వహించిన కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను అభినందించారు. పోర్టల్ ప్రారంభించినప్పటి నుండి పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న దొంగతనానికి గురైన 90 ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అందించడం జరిగిందని, ఎవరైనా మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో బ్లాక్ చేసి, పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. మొబైల్ ఫోన్లను పట్టుకోవడానికి సిఈఐఆర్ వెబ్‌సైట్ ఎంతో ఉపయోగపడుతుందని సీఈఐఆర్ వెబ్‌సైట్లో వినియోగదారులు వివరాలను నమోదు చేసుకుంటే మొబైల్‌ని ఈ పోర్టల్ ద్వారా సులభంగా స్వాధీనం చేసుకునే ఆస్కారం ఉంటుందని ఎస్ఐ తెలిపారు. పోయిన సెల్ ఫోన్ పట్ల అశ్రద్ధ చేస్తే ఫోన్లలో ఉన్న వ్యక్తిగత ఆధారాలతో నష్ట పోవాల్సివస్తుందన్నారు. ఇది వ్యక్తిగత సామాజిక భద్రతకు భంగం కలుగుతుందన్నారు. అదే విదంగా ఎవరైనా సెకండ్ హాండ్ ఫోన్‌లు కొనే ముందు అప్లికేషన్‌లో ఫోన్ ఈఎంఐ నంబర్లు నమోదు చేసి చెక్ చేసుకోవాలని తద్వారా ఫోన్ స్టేటస్ తెలుస్తుందన్నారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-జన్నారం

ఎస్సీ వర్గీకరణ కోసం 30 సంవత్సరాలు నిరాంతరం పోరాటం చేసి వర్గీకరణ సాధించిన మహనీయుడు మందకృష్ణ మాదిగ అని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా నాయకుడు పల్లి జగన్మోహన్ అన్నారు. ఆదివారం మండలంలోని కలమడుగు గ్రామంలో ముందుగా ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పుపట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. దీంతో మాదిగలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. వర్గీకరణకు సహకరించిన అన్ని పార్టీల నాయకులకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పెళ్లి అంజన్న, గంగన్న, శంకర్, వెంకటేష్, నారాయణ, లక్ష్మణ్, రంజిత్ పాల్గొన్నారు.

చెన్నూర్ బల్దియా అస్తవ్యస్తం..!

- లోపించిన పారిశుధ్యం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



నవతెలంగాణ-మంచిర్యాల

గత పాలకుల నిర్లక్ష్యమో.. కొత్తగా వచ్చిన అధికార యంత్రాంగం పర్యవేక్షణ లోపమో.. చెన్నూర్ పట్టణం అస్తవ్యస్తంగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రజలు పారిశుధ్య సమస్యలతో సతమతం అవుతున్నారు. దీర్ఘకాలింగా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల, నాయకుల పర్యవేక్షణ కరువవడంతో రోగాల భారిన పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. కాలువల్లో దోమలు, క్రిమి కీటకాలకు వ్యాప్తి చెంది ప్రజారోగ్యం దెబ్బతింటుందోని పలువురు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు..



పలు కాలనిల్లో నిలిచిన మురికి నీరు

ఇటీవల కురిసిన వర్షాలకు చెన్నూర్ పట్టణంలోని పలు కాలనీల్లో వరద నీరు నిలిచి మురికి కుంటలుగా మారాయి. ఒక వైపు నిలిచిన నీరు, మిషన్ భగీరథ పైపుల లీకేజి, వాటి కోసం తవ్విన గుంతల్లో నీరు చేరడంతో దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. దీనికి తోడు ఆయా కాలనీల్లో రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగాయి. స్థానిక మున్సిపల్ అధికారులు స్పందించక పోవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ముందు జాగ్రత్తగా రోగాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఆయా కాలనీల్లో వర్షపు నీరు నిండి మురికి కాలువల్లోని నీరు అంత రోడ్లపై పారుతుంది. అక్కడక్కడ డ్రైనేజీలు ఉన్న కార్మికులు శుభ్రం చేయక పోవడంతో దోమలు అధికమవుతున్నాయి.

తీవ్రమవుతున్న విద్యుత్ సమస్య

ఈదురు గాలులకు కరెంట్ సమస్య ఎక్కువ అవుతుంది. వైర్లు ఒకదానికి ఒకటి తగిలి విద్యుత్‌లో అంతరాయం ఏర్పడుతుంది. కొన్ని సందర్భాల్లో తెల్లారే వరకు చీకట్లో ఉండాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల చెన్నూర్ పట్టణాన్ని సందర్శించిన సీపీఐ(ఎం) నాయకులకు తమా గోడును వేళ్ళ బోసుకున్నారు.

జాడలేని దోమల నివారణ చర్యలు

వర్షాకాలం ప్రారంభం ఆయా కాలనీల్లో మున్సిపల్ సిబ్బంది చేపట్టాల్సిన దోమల నివారణ చర్యలు ఇంతవరకు ప్రారంభించలేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు మిషన్ భగీరథ పైపులు పగలడం, లీకేజి లతో అంతర్గత రోడ్లన్నీ మురికి కూపాలుగా మారాయి. వాటిలో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. బ్లీచింగ్ పౌడర్‌ను చల్లక పోవడంతో ఈగలు, దోమలు బెడద పెరిగిందని, ఫాగింగ్, స్ప్రే చేయాలని అంటున్నారు. ఇప్పటికి అయిన ఉన్నత అధికారులు స్పందించి పారిశ్యుధం పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మురికి నీరు నిలిచి కంపు కొడుతోంది

సామల ఉమారాణి, పద్మనగర్.



చెన్నూర్ పట్టణంలో రోడ్లు, డ్రైనేజి సమస్యలతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. వర్షపు నీరు కాలువల్లో చేరి రోడ్లపై పారుతుంది. ఒక వైపు మిషన్ భగీరథ పైపుల కోసం తవ్విన గుంతల్లో నీరు చేరి ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఇప్పటికి బ్లీచింగ్ పౌడర్ చల్లలేదు. వానాకాలం వచ్చిందంటే డ్రైనేజిలు నిండి ఇండ్లలోకి నీళ్లు చేరుతాయి. దోమల బెడద, దుర్వాసనను భరించలేక పోతున్నాం. రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి.

ముందస్తు చర్యలు చేపడుతున్నాం

గంగాధర్, మున్సిపల్ కమిషనర్ చెన్నూర్.

గతంలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా అన్ని వార్డుల్లో బ్లీచింగ్ పౌడర్ వేశాము. రోడ్లు, డ్రైనేజిల నిర్మాణానికి అంతకుముందు ప్రపోజల్ పెట్టినప్పటికీ సాంక్షన్ కాలేదు. మళ్లి కొత్తగా ప్రపోజల్ పెట్టినం బడ్జెట్ వస్తది వచ్చే నెలలో పనులు ప్రారంభిస్తాము. సీజనల్ వ్యాధులపై ముందస్తు చర్యలు చేపడుతున్నాము.

రాజకీయ లబ్ది కోసమే దళితులను విడగొట్టారు

- మాల సంఘం పట్టణ అధ్యక్షుడు గోశిక మనోజ్ కుమార్



నవతెలంగాణ-నస్పూర్

రాజకీయ లబ్ది కోసమే దళితులను విడగొట్టి వారి మధ్య చిచ్చు పెట్టారని, ఎస్సీ వర్గీకరణకు సహకరించారని మాల సంఘం పట్టణ అధ్యక్షుడు గోశిక మనోజ్ కుమార్ అన్నారు. ఆదివారం మాల సంఘం ఆధ్వర్యంలో సీసీసీ కార్నర్‌లోని అంబేద్కర్ విగ్రహంకి వినతి పత్రం అందజేసి, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 1న ఏడుగురు సభ్యులకు ఏర్పడిన ధర్మాసనం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు 6.1 చొప్పున వర్గీకరణ చేయొచ్చని తీర్పు వెల్లడించడం జరిగిందని దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఆర్టికల్ 341 ప్రకారం 2004లో జరిగిన వాదోపవాదాలు విన్న అయిదుగురు సభ్యుల ధర్మాసనం ఈ ఎస్సీ వర్గీకరణ చేయడానికి వీలుకాదని, అది రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో లేదని, అలాగే ఈ వర్గీకరణ చేయడానికి రాజ్యాంగం ప్రకారం వీలు కాదని తీర్పును వెల్లడించడం జరిగిందన్నారు. ఆ తీర్పును తోసిపుచ్చుతూ ఆగస్టు1 ఏడుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం వర్గీకరణ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేయొచ్చని తీర్పు ఇవ్వడం ద్వారా అన్నదమ్ముల్లాగా కలిసి ఉన్నటువంటి దళిత సోదరులను విడగొట్టే కుట్ర జరుగుతుందన్నారు. దీనిలో ఎటువంటి రాజకీయ ఒత్తిడి లేనట్లయితే కేంద్ర ప్రభుత్వం వెంటనే తీర్పు వెల్లడించిన వెంటనే మందకృష్ణ మాదిగ న్యాయమూర్తిని కలవడానికి వెళ్లడం, అలాగే కేంద్ర ప్రభుత్వం ఇంతకు ముందు ఎన్నికల్లో ప్రచారంలో చెప్పిన వాగ్దానం ప్రకారం వర్గీకరణ చేయిస్తా అని చెప్పడం ఇవన్నీ చూస్తుంటే అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా దీనికి ఒక కమిటీ కచ్చితంగా వేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే మన రాష్ట్ర ప్రభుత్వం తీర్పు వెలువడిన వెంటనే అసెంబ్లీలో ఏదైతే ఉద్యోగాలు పరీక్ష నిర్వహిస్తున్నారో అందులో ఈ తీర్పు ప్రకారం వర్గీకరణకు సంబంధించి నిష్పత్తి ప్రకారమైతే ఉద్యోగాలు ఇస్తామని చెప్పడాన్ని వ్యతిరేకిస్తున్నమ్మన్నారు. ఈ కార్యక్రమంలో మహానాడు స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్ట మధుకర్, మాల మహానాడు మంచిర్యాల జిల్లా సెక్రెటరీ మండల రవి కుమార్, మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి భూపెల్లి మల్లన్న, మాల సంక్షేమ సంఘం కోర్ కమిటీ సభ్యులు గరిసె రామస్వామి, జవాజి నందయ్య, ధోనిపెల్లి లింగయ్య, తలారి రాజు, దామర్ల పద్మయ్య, కందుల రాయలింగు, ప్రచార కార్యదర్శి పండుగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకుంది

- ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు సోహెల్‌షా

నవతెలంగాణ-జన్నారం



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకొని జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు సోహెల్షా అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వేడమా బొజ్జు పటేల్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా నిలుస్తుందని అన్నారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి చదువుకుంటున్న వారికి ఉద్యోగాలు వచ్చే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షులు అజ్మత్ ఖాన్, కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ముజాఫర్ అలీ ఖాన్, మేకల మాణిక్యం, నాయకులు గుర్రం మోహన్‌రెడ్డి, ముత్యం రాజన్న, మిక్కిలినేని రాజశేఖర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ రియాజుద్దీన్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఫసియుల్లా, నందు నాయక్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ జ్ఞాపకార్థం అన్నదానం

నవతెలంగాణ-తాండూర్



అమ్మ ఒడి ఎన్‌జీఓ అన్నదాత ప్రాజెక్ట్, టెక్నో డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే గుండమల్లేష్ జ్ఞాపకార్థం ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గుండ మల్లేష్ మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో గుండ సమత, గుండ సరోజగారి ఆధ్వర్యంలో ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా అన్నదానాన్ని నిర్వహించారు. బెల్లంపల్లి పట్టణంలో కాంట చౌరస్తా పల్లేటూరి బస్టాండ్ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యాచకులకు, నిరుపేదలకు, కూలీలకు, బాటసారులకు, సుమారు 200 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు గుండ సమత, సరోజ అమ్మ ఒడి సభ్యులు హనుమాండ్ల సువర్ణ, అమూల్య, సిద్దమల్ల రఘు, యూసుఫ్, చెందుపట్ల లింగమూర్తి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారం



నవతెలంగాణ-నస్పూర్

మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారమవుతుందని మంచిర్యాల రూరల్ సీఐ అశోక్ అన్నారు. ఆదివారం నస్పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సుగుణాకర్ తో కలిసి గంజాయి సేవించి పట్టుబడిన యువకులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎంతో మంచి భవిష్యత్తు ఉన్న యువకులు, విద్యార్థులు గంజాయి, ఇతరాత్ర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. చాలామంది యువకులు విద్యార్థులు గంజాయికి బానిసై గొడవలు, కేసులతో తమ బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారని అన్నారు. కేసులు నమోదైన వారికి భవిష్యత్తులో ఎలాంటి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించవని అన్నారు. ఇప్పటికైనా గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ తమ భవిష్యత్తును చక్కదిద్దుకోవాలని కోరారు. గంజాయి సరఫరా చేసే వారు గాని విక్రయించేవారి సమాచారం పోలీసులకు అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. గంజాయిపై పోలీస్ శాఖ నిరంతరం నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గంజాయిని నిర్మూలించడానికి టెస్టింగ్ కిట్లు వచ్చాయని, టెస్టింగ్ గిట్ల ద్వారా గంజాయి సేవించినట్లు నిర్ధారణ అయి పట్టుబడితే కేసులు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్, అధ్యాపకులను విధుల నుంచి తొలగించాలి



నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులను తొలగించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి శ్రీకాంత్, యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థులతో పనులు చేపించుకుంటున్న క్రమంలో ఆ కళాశాల ఉపాధ్యాయురాలు డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్న వైష్ణవి విద్యార్థికి లాప్టాప్ ఇచ్చి ఛార్జింగ్ పెట్టమని చెప్పడంతో ఆ విద్యార్థి చార్జింగ్ పెట్టే క్రమంలో విద్యుత్ షాక్‌కి గురైందన్నారు. ఇటువంటి సంఘటనలే కాకుండా ఆ కళాశాలలో భోజనం సరిగ్గా ఉండడం లేదని, బాత్రూములు సరిగా లేవని గత సంవత్సరంలోని కలెక్టర్, సంబంధిత అధికారులకు దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోని పరిస్థితి ఉందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు అంజి, అరవింద్, వినోద్, అభినవ్, అజయ్, విష్ణు పాల్గొన్నారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి

- ఎస్టీపీపీ హెచ్ఎంఎస్ యూనియన్ డిమాండ్



నవతెలంగాణ-జైపూర్

గతంలో ఎస్టీపీపీ నిర్వాహణ బాధ్యతలు చేపట్టిన స్టాగ్ కంపెనీ కాంట్రాక్టు కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని జైపూర్ ఎస్టీపీపీ హెచ్ఎంఎస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసుకున్న జనరల్ బాడీ సమావేశంలో స్టాగ్ కంపెనీ బకాయిల చెల్లింపుల్లో సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోందని వారు ఆరోపించారు. కాంట్రాక్టు గ్రాడ్యూటీ సరీస్ పే ఇప్పటి వరకు కాంట్రాక్టు కార్మికులకు చెల్లించకపోవడం బాధాకరమని అన్నారు. ఈ విషయమై గతంలో పలుమార్లు హెచ్ఎంఎస్ యూనియన్ ఆధ్వర్యంలో ప్లాంట్ జనరల్ మేనేజర్‌ను కలిసి వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. స్టాగ్ కంపెనీకి సంబంధించిన బకాయిల డబ్బులు సింగరేణి యాజమాన్యం తమ వద్దనే అట్టిపెట్టుకుని కార్మికులకు చెల్లించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. పవర్‌మేక్ కంపెనీ కింద ఉన్నటువంటి కాంట్రాక్టు విడుదల చేయగా స్టాగ్ కంపెనికి సంబంధించిన డబ్బులు విడుదల చేయకపోవడం బాధాకరమని అన్నారు. అదేవిధంగా సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో ప్రయివేటు కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డ్స్‌గా పని చేస్తున్న వారికి డ్రెస్సులు, బూట్లు ఇప్పటి వరకు ఇవ్వలేదని, ఇప్పటికైనా సెక్యూరిటీ గార్డ్స్‌కు డ్రెస్సులు, బూట్లు రెండు జతల చొప్పున పంపిణీ చేయాలని ఈ సంధర్భంగా డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జనరల్ సెక్రెటరీ విక్రమ్ కుమార్, తిప్పర్తి సంపత్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీధర్, రమేష్, అంజీ పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా సాయి కృష్ణారెడ్డి, కార్యదర్శిగా మునుమండ్ల రమేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఆజార్, చిప్పకుర్తి తిరుమలేష్‌లు ఎన్నికైనట్లు వెల్లడించారు.

కనుగుట్ట బడికి వెళ్లాలంటే తిప్పలే

నవతెలంగాణ-బోథ్



మండలంలోని కనుగుట్ట గ్రామంలో జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే రోడ్డు బురదమయంగా మారింది. వర్షం పడితే రోడ్డు పూర్తిగా చిత్తడిగా మారి, విద్యార్థులకు రాకపోకలకు కష్టంగా ఉంటుందని వాపోయారు. నడవడానికి రోడ్డు లేక బురదలోంచి వెళ్లడం జరుగుతుందని అన్నారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని, వెంటనే రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని కోరారు.

మాజీ సైనికులపై అసత్య ప్రచారం

నవతెలంగాణ-మంచిర్యాల



మంచిర్యాల జిల్లాకు చెందిన రిటైర్డ్ ఆర్మీ అధికారి భూమి కబ్జా చేశాడని బీజేపీ నాయకులు మాట్లాడిన తీరును రిటైర్డ్ ఆర్మీ అధికారుల సంక్షేమ సంఘం నాయకులు ఖండించారు. ఆదివారం పట్టణం లోని ప్రైయివేట్ హాల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఇటీవల జరిగిన బీజేపీ ప్రెస్ మీట్‌లో నాయకులు మంచిర్యాలలో రిటైర్డ్ ఆర్మీ అధికారి ఒకరు భూ కబ్జాలు చేశారని ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేశారని చేసిన ఆరోపణాల్లో వాస్తవం లేదన్నారు. బీజేపీ నాయకులు మాటలు రిటైర్డ్ ఆర్మీ సైనికుల మనోభావాలను దెబ్బ తీసేలా ఉన్నాయన్నారు. బీజేపీ నాయకులు సైనికులకు అండగా ఉండాల్సింది పోయి ఇలా తప్పుడు ప్రచారాలు చేయడం బాధాకరమన్నారు. ఇలాంటి అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని హెచ్చరించారు. సమావేశంలో రిటైర్డ్ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు భాస్కర్ బాల్నే ఉపాధ్యక్షులు సత్యనారాయణ, రవి, చారి పాల్గొన్నారు.

దాసరి లచ్చన్న మృతి మున్నూరు కాపులకు తీరని లోటు

నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల జిల్లా మాజీ మున్నూరు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు దాసరి లచ్చన్న మృతి కుల సోదరులకు తీరని లోటని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగం రాజారాం, జిల్లా అధ్యక్షుడు నల్ల శంకర్, జిల్లా యూత్ అధ్యక్షుడు శ్రీపతి సురేష్, పీఆర్ఓ బి.రాజేశంలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం గుండె పోటుతో దాసరి లచ్చన్న మృతి చెందడం విచారకరమన్నారు. జిల్లా మున్నూరు కాపు సంఘం ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. మంచిర్యాల రెండు పర్యాయాలుగా కౌన్సిలర్‌గా ప్రజలకు సెవ చేశారన్నారు. ఆయన మృతి పట్ల సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతిని ప్రకటిస్తున్నామని పేర్కొన్నారు.

న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని పెంచింది



నవతెలంగాణ-కాసిపేట

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం 30 సంవత్సరాలుగా దేశంలో జరుగుతున్న పోరాటానికి సుప్రీం కోర్టు న్యాయమైన ముగింపునిచ్చిందని, ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు న్యాయవ్యవస్థ నమ్మకన్ని పెంచిందని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కల్వల శరత్ మాదిగ పేర్కొన్నారు. వర్గీకరణ అమలు జరపాలని రాష్ట్రాలకు అధికారాన్నిస్తూ సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో ఆదివారం సోమగూడెంలో మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణను అమలు చేయాలని, తెలంగాణ రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం మాదిగ, ఉపకులాలకు రావాల్సిన రిజర్వేషన్ల శాతాన్ని కేటాయించి వర్గీకరణ అమలు చేయాలని, ఇప్పటి వరకు ఇచ్చిన నోటిఫికేషన్‌లలో రిజర్వేషన్ల వర్గీకరణ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దాసరి రాంచేందర్, కొండ్రా తిరుపతి, ఉప్పులేటి శ్రీనివాస్, కుక్క రాంచేందర్, లంక లక్ష్మణ్, చిలుముల పోశం, బూడిది రమేష్, వేమూర్ల వెంకటేష్, చొపదండి కిషన్ పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలలపై సీఎం వ్యాక్యలు సరికాదు

నవతెలంగాణ-నస్పూర్

కనీస విద్యార్హత లేని వారిని ఉపాధ్యాయులుగా నియమించి ప్రయివేటు పాఠశాలలు నడుపున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానిండం సరికాదని టస్మా స్టేట్ వైస్ ప్రెసిడెంట్ మల్లెత్తుల రాజేంద్రపాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాదాపు 95 శాతం ప్రయివేటు పాఠశాలల్లోనే ట్రైన్డ్ టీచర్స్ పనిచేస్తున్నారని, ఎందుకంటే ప్రభుత్వాలు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో బీఈడీ, టీటీసీ చేసిన వాళ్లందరూ ప్రయివేట్ స్కూల్లో పని చేస్తున్నారని తెలిపారు. ప్రయివేట్ విద్యాసంస్థలు సుమారుగా 5 లక్షల మంది టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. 30 వేల ప్రభుత్వ పాఠశాలలో 26 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని, వారికి విద్యలు అందించడానికి ఒక్కో విద్యార్థికి ఫస్ట్ నుంచి టెన్త్ క్లాస్ వరకు ప్రభుత్వం రూ.50 వేల ఖర్చు పెడుతుందని, అంటే ఒక్క సంవత్సరానికి విద్యార్థులపై రూ.13 వేల కోట్లు ఖర్చు పెడుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 10,000 ప్రయివేట్ పాఠశాలల్లో 33 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని, ఒక విద్యార్థికి రూ.20వేలు మొత్తం రూ.6,600 కోట్లు ఖర్చవుతున్నాయని తెలిపారు. సుమారు రూ. 6,600 కోట్లు ప్రభుత్వానికి బడ్జెట్ మిగులుతుందని తెలిపారు.

ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్, సివిల్ అసిస్టెంట్ సర్జన్, జూనియర్ రెసిడెంట్ పోస్టు భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్టు మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ బివి నాగమోహన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 ప్రొఫెసర్, 9 అసోసియేట్ ప్రొఫెసర్, 14 అసిస్టెంట్ ప్రొఫెసర్, 10 సివిల్ అసిస్టెంట్ సర్జన్స్, 18 జూనియర్ రెసిడెంట్ పోస్టులు ఖాళీ ఉన్నాయని అందులో అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పథాలజీ, ఇఎన్టి, ఆప్తమాలజీ, గైనకాలజీ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీ ఉన్నాయని, ఫిజియాలజీ, ఫార్మకాలజి, పథాలజీ, కమ్యూనిటీ మెడిసిన్-2, జనరల్ మెడిసిన్-2, సైకియాట్రి, అనస్థేషియా అసోసియేట్ ప్రొఫెసర్‌లు ఖాళీ ఉన్నాయని, అనాటమీ, ఫిజియాలజీ-2, బయో కెమిస్ట్రీ-2, ఫార్మకాలజీ, ఫరెన్సిక్ మెడిసిన్, గైనకాలజీ-3, కార్డియాలజీ, సిటీ సర్జరీ, ఎమర్జెన్సీ మెడిసిన్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఖాళీ ఉన్నాయని, బయో కెమిస్ట్రీ, పథాలజీ-2 ట్యూటర్ పోస్టులు ఖాళీ ఉన్నాయని వివరించారు. ఈనెల 6 నుండి 12 వరకు ఉదయం 10:30 నుండి సాయంత్రం 4 వరకు మెడికల్ కళాశాలలో దరఖాస్తులు స్వీకరించబడునని, అదేవిధంగా ఈనెల 13 న ఉదయం 11 గంటల నుంచి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ కు వర్జిన్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. ఈనెల 14న ఇంటర్వ్యూలు ఉదయం 11 గంటల నుండి నిర్వహించడం జరుగుతుందని, అంతేకాకుండా మిగతా సమాచారం కోసం వెబ్సైట్ సందర్శించి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

ప్రజా సమస్యలపై పోరాటాలే

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రజా సమస్యలపై పోరాటాలే ప్రభుత్వాలను కదిలిస్తాయని సీపీఐ(ఎం) కార్యకర్తల సమావేశంలో నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం పార్టీ కార్యాలయంలో నగర పార్టీ కార్యకర్తల విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, కార్యదర్శివర్గ సభ్యులు పెద్ద వెంకట్ రాములు మాట్లాడుతూ.. పెట్టుబడిదారీ అనుకూల విధానాల మూలంగా పేదరికం మరింత పెరిగి అంతేగాని డొక్కాడని పేదల సమస్యలు పరిష్కారం చేయటంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అందువల్ల సమస్యలపై పోరాటాల ద్వారా మాత్రమే ప్రభుత్వాలను వంచగలుగుతామని వారు అన్నారు. పేదలకు అవసరమైన కూడు, గూడు, గుడ్డ కల్పించడంలో సరైన విధానాలు అనుసరించకపోవడంతో ఉపాధి అవకాశాలు తగ్గిపోయి పేదరికం పెరిగిపోతుందని ప్రజల జీవన ప్రమాణాలు పడిపోతున్నాయని వాటి నుంచి ప్రజల దృష్టిని మరల్చటానికి ప్రజల్లో వైశాల్యాలను పెంచి రాజకీయ లబ్ధి పొందాలని మతతత్వ విధానాలను అధికారాన్ని నిలబెట్టుకోవటానికి బిజెపి ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కమ్యూనిస్టులు బలపడినప్పుడే ప్రభుత్వాలను కలుగుతామని అందుకు కష్టజీవులను ఐక్యం చేయాలని వారు అన్నారు. కేరళలో వచ్చిన వరదల మూలంగా వేలాది కుటుంబాలు నిరాశ్రయులుగా మారారని వందలాది మంది ప్రాణాలు కోల్పోయారని, అనేకమంది జాడ ఇంకా లభించలేదని, వారిని ఆదుకోవటానికి మానవతావాదులు ప్రజలు సహకరించాలని కోరారు.

దళితులపై కాంగ్రెస్‌ది కపట ప్రేమే



నవతెలంగాణ-తాంసి

దళితబంధు పథకం రద్దు చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి దళితులపై ఉన్నది కేవలం కపట ప్రేమేనని యావత్ దళిత కుటుంబాలకు అర్థమవుతోందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన 54 మంది దళిత బస్తీ లబ్ధిదారులకు. డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్‌తో కలిసి పెట్టుబడి సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలలో దళితబస్తీ, దళతబంధు పథకం, దళిత కుటుంబాలకు ఎంతో ఉపయోగపడి ఆర్థికంగా అభివృద్ధి చెందడం జరిగిందని అన్నారు. కూలీలు భూ యజమానులు అయ్యారని, కానీ కేసీఆర్ ప్రవేశ పెట్టిన పథకాలు లేకుండా ఉండాలని దళితబంధును కాంగ్రెస్ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. రైతులందరికీ రుణమాఫీ చేస్తామని ఎన్నికల్లో మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత రుణమాఫీలో కానిపోని నిబంధనలు పెట్టి రైతులను మోసం చేస్తుందన్నారు. ఇటు రైతులపై దళితులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి కేవలం కపట ప్రేమ అని అర్థమైందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సుధాకర్, కన్వీనర్ నాగయ్య, నాయకులు లస్మన్న, కృష్ణ, అనిల్, సంజీవ్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సంతోష్, లింబాజీ, ఆఫ్రోజ్, రమణ, రఘు, తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిలాబాద్ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



- రక్తదానం చేసి, చాటుకున్న అభిమానం
- ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి చేరుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, అబిమానులు, ఆయా సంఘాల నాయకులు, అధికారులు పుష్పగుచ్చాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారితో కలిసి కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఇందులో భాగంగా అక్కడ ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే పాయల శంకర్ ప్రారంభించారు. రక్తదానం చేస్తున్న అభిమానులు, పార్టీ నాయకులను ప్రోత్సహిస్తు పండ్ల రసం అందించి అభినందించారు. ఈ శిబిరంలో దాదాపు 800 మందికి పైగా రక్తదానం చేసి వారి అభిమానాన్ని చాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జన్మదినం సందర్భంగా పార్టీ శ్రేణులు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. రక్తం అందక ఎంతో మంది ప్రాణాలను కొల్పోతున్నారని, అలాంటి తరుణంలో తన జన్మదినాన్ని పురస్కరించుకొని మెగా రక్తదానం చేపట్టడం సంతోషకరమన్నారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లాలామున్న, దినేష్ మటోలియ, ఆకుల ప్రవీణ్, ఆర్యన్ రాజేష్, మహేందర్, ధోని జ్యోతి, సునందరెడ్డి ఉన్నారు.

మొక్కల పంపిణీ...

ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు అస్తక్ సుభాష్ ఆధ్వర్యంలో మొక్కలను పంపిణీ చేశారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సూచిస్తూ, మొక్కలను అందించారు. దాదాపు వెయ్యి మొక్కలను అభిమానులు, పార్టీ శ్రేణులకు పంపిణీ చేశారు.



17 నుంచి పీడీఎస్‌యూ శిక్షణ తరగతులు



నవతెలంగాణ-మంచిర్యాల

ఆగస్టు 17, 18, 19 తేదీలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సిద్దిపేటలో జరిగే రాష్ట్ర విద్య, వైజ్ఞానిక, శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని జిల్లా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్ కోరారు. ఆదివారం ఎస్టీ బాయ్స్ హాస్టల్‌లో శిక్షణ తరగతుల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో స్వతంత్రం వచ్చి 75 ఏండ్లు గడిచాయని ఒకపక్క ఆజాద్ క అమృత్ మహోత్సవం పేరుతో ఉత్సవాలు జరుగుతున్న నేటికీ పేద, బడుగు, బలహీన వర్గానికి కనీస సౌకర్యాలైన విద్య, వైద్యం ఉపాధి అవకాశాలు రోజురోజుకు కనుమరుగవుతున్నాయని అన్నారు. పాలకుల విధానాలతో సమాజంలో ఉన్న అన్ని రంగాల్లో అసమానతలు పెరిగిపోతున్నాయని, బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక దేశంలోని విద్య కాషాయకరణ చేసే పరిస్థితి నెలకొందని ఆరోపించారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చి కార్పొరేట్లకు తాకట్టుపెట్టే పరిస్థితి ఉందన్నారు. పోరాటాల ద్వారానే విద్యార్థులకు తమ హక్కులు సాధించుకోగలుగుతామన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి సిద్ధార్థ, నాయకులు చరణ్, అన్వేష్, మనోహర్, మహేష్ పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కి పాల్పడితే చర్యలు



- ఎంజేపీ పాఠశాల ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్

నవతెలంగాణ-లక్షెట్టిపేట

ర్యాగింగ్‌కి పాల్పడితే చర్యలు తీసుకుంటామని మహాత్మ జ్యోతిబాపూలే కళాశాల ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. వారం రోజులుగా పాఠశాల, కళాశాలలో సీనియర్స్ జూనియర్స్ మధ్య చిన్నచిన్న విభేదాలతో గొడవలు జరుగుతున్నాయన్నారు. ఈ విషయంలో హెచ్చరించిన వినకుండా గొడవలు చేసుకుంటున్నారు. ఒకరిపై ఒకరు కోపంతో కొట్టుకోవడంతో గాయాలు జరిగాయన్నారు. దీనిపై పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్ మాట్లాడుతూ వారం రోజుల ముందే బదిలీపై వచ్చానని, ఇక్కడి పరిస్థితులను అర్థం చేసుకొని వాళ్లని హెచ్చరించేలోపే ఇలాంటి సంఘటనలు జరిగాయన్నారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే కళాశాల నుండి డిస్మిస్ చేస్తామని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, వారితో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన, తొందరపాటు చెందకుండా ఉండాలని సూచించారు.



ఎల్‌ఈడీ ట్యూబు లైట్‌ల తయారిపై ఉచిత శిక్షణ

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లా సైన్స్ కేంద్రంలో ఈనెల 8న జిల్లా సైన్స్ సెంటర్‌లో ఎల్‌ఈడీ ట్యూబ్ లైట్ తయారీపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణ అటవీ వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ పాఠశాల విద్యార్థుల కోసం సస్టైనబుల్ లైఫ్ స్టైల్ గూర్చి తెలపాలనే ఉద్దేశ్యంతో పర్యావరణ క్షీణతను, సహజ వనరుల వినియోగం, సీఓటు ఉద్గారాలు, వ్యర్థాలు, కాలుష్యం తగ్గించే జీవన మార్గాలు, సామాజిక-ఆర్థిక అభివృద్ధి, అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలకు తోడ్పాటునిచ్చే మార్గాలను విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపింది. దీనికనుగుణంగా తెలంగాణ రాష్ట్ర గ్రీన్ కోర్, జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లా సైన్స్ కేంద్రంలో 8న ఉదయం 9.30 గంటలకు ప్రతి ఎంజీసీ ఎకో క్లబ్ పాఠశాల నుండి 50 పాఠశాలల ఒక్కో పాఠశాల నుంచి ముగ్గురి చొప్పున విద్యార్థులతో మొత్తం 150 మంది విద్యార్థుకు ఒక రోజు ఎల్‌ఈడీ ట్యూబ్ లైట్ తయారీ వర్క్‌షాప్ నిర్వహించనున్నామని, ఇక్కడ విద్యార్థులు తాము సొంత ఎల్‌ఈడీ ట్యూబ్ లైట్‌లను సిద్ధం చేసి ఇంటికి తీసుకెళ్ళేలా నేర్పిస్తామన్నారు. కంపోస్ట్ పిట్ విధానాలపై ఒక సెషన్ కూడా నిర్వహించబడుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి, జిల్లా కోఆర్డినేటర్ మధుబాబుకు సంప్రదించాలన్నారు.

రిటైర్డ్ కార్మికుల పెన్షన్ సవరించి ఏరియర్స్ చెల్లించాలి

- సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్

నవతెలంగాణ-జైపూర్

బొగ్గు గని కార్మికులకు సంబందించి 11వ వేజ్‌బోర్డులో ఉన్న రిటైర్డ్ కార్మికుల పెన్షన్ సవరించడంతో పాటు పెన్షన్ ఏరియర్స్ చెల్లించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. 2021 జూలై 1 నుండి అమలు కావల్సివుండగా 2023 మే నెలలో కార్మిక సంఘాలతో కోలిండియా, సింగరేణి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మధ్య కాలంలో రిటైర్డ్ అయిన కార్మికుల పెన్షన్ సవరించడంతో పాటు పెన్షన్ ఏరియర్స్ చెల్లించే విధంగా సింగరేణి యాజమాన్యం, సీఎంపీఎఫ్ అధికారులు చర్యలు తీసుకోవల్సివుందని అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఆళవందార్ వేణుమాధవ్ తెలిపారు. 2021 జూలై నుండి 2023 మే నెల మధ్య కాలంలో రిటైర్డ్ అయిన కార్మికులకు 11వ వేజ్‌బోర్డు ప్రకారం పెన్షన్ సవరింపు, ఏరియర్స్ చెల్లింపులపై సింగరేణి యాజమాన్యం చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని అన్నారు. ఫలితంగా రిటైర్డ్ అయిన కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారని, వేజ్‌బోర్డు ఒప్పందం ప్రకారం వేతనాలకు సంబంధించి పెరిగిన ఏరియర్స్ 2024 ఫిబ్రవరి నెలలో రిటైర్డ్ అయిన ఉద్యోగులకు కూడ చెల్లించారని తెలిపారు. రిటైర్డ్ కార్మికులు గత మూడు నెలల క్రితం తమ వ్యక్తిగత వివరాలను సంబంధిత గనుల సంక్షేమ అధికారులకు సమర్పించగా ఇప్పటి వరకు అతీగతీ లేకుండా పోయిందని తెలిపారు. పెరిగిన వేతనాల ప్రకారం పెన్షన్ లెక్కించి సీఎంపీఎఫ్ అధికారులకు పంపించగా రిటైర్డ్ కార్మికుల వివరాలు నూతన ఫార్మెట్‌లో పంపాలనీ సీఎంపీఎఫ్ అధికారులు తిరిగి సింగరేణి అధికారులకు వాపస్ పంపించారని తెలిపారు. రిటైర్డ్ కార్మికులకు సంబంధించిన వివరాలు సింగరేణి, సీఎంపీఎఫ్ అధికారుల మధ్య తిరుగుతుండటంతో రిటైర్డ్ కార్మికులు పెరిగిన పెన్షన్‌తో పాటు ఏరియర్స్ పొందలేకపోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా సింగరేణి అధికారులు, కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ (సీఎంపీఎఫ్) అధికారులు రిటైర్డ్ కార్మికుల సమస్య పట్ల చొరవ చూపించి పెరిగిన పెన్షన్‌తో పాటు ఏరియర్స్ చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

వేలాడితేనే.. ప్రయాణం

- సరిపడా బస్సులు లేక ఫుట్‌పాత్ ప్రయాణం చేస్తున్న విద్యార్థులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)

ఆర్టీసీలో ప్రయాణం సుఖవంతం.. సుభప్రదం అని ఆ సంస్థ అధికారులు ప్రచారం చేసుకుంటారు. కానీ ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా మారాయి. ఆర్టీసీ ప్రయాణం అంటేనే నరకప్రాయం.. ఇబ్బందికరం అని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు లేక తమ గమ్యస్థానానికి చేరేందుకు అనేక ప్రయాసాలకోర్చాల్సి వస్తుంది. ఒక్కో బస్సులో పరిమితికి మించి రెండితల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఇక విద్యార్థుల ఇక్కట్లు మరింత పెరిగాయి. ఫుట్‌బోర్డు మీద వేలాడుతూ ప్రయాణం చేపట్టాల్సిన దుస్థితి నెలకొంది. విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. బాన్సువాడ పట్టణం నుండి వివిధ గ్రామాలకు వెళ్లే విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక నానావస్థలు పడుతున్నారు. ఒకే బస్సులో వంద నుంచి 150 మంది విద్యార్థులు ఒకే బస్సులో వెళ్లే పరిస్థితి ఏర్పడింది. బస్సు పుట్ ఫాత్ పై ప్రయాణం ప్రమాదకరమని తెలిసినప్పటికీ చేసేది ఏమీ లేక తప్పని పరిస్థితిలో బస్సు ప్రయాణం చేయాల్సి వస్తుంది. నేడు బాన్సువాడ పట్టణంలోని తడ్కోల్ చౌరస్తా లో బస్సులు లేక ఒకే బస్సులో వందకు పైగా విద్యార్థులు ప్రయాణించారు. బీర్కూర్ నసురుల్లాబాద్ మండలం పిట్లం తదితర మండలాలకు వెళ్లే విద్యార్థులకు నానా అవస్థలు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వల్ల విద్యార్థులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. బస్సులు సమయానికి రాక, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కళాశాల విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం ప్రత్యేక బస్సులు నడపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని యెడల విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరిస్తున్నారు.

5571 పీఎస్ హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అసెంబ్లీలో గత ముఖ్యమంత్రి చేసిన ప్రకటన ప్రకారం 5571 పిఎస్ హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేసి సర్వీసు నిబంధనల జి.ఓ.. 11 మరియు12 లను సవరించి డిగ్రీ, బీఈడ్ అర్హతలతో నియామకమైన ఎస్జీటీ లకు కూడా పిఎస్ హెచ్‌ఎం పదోన్నతులు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్యుటిఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి. సత్యానంద్, ఓ. రమేష్ డిమాండ్ చేశారు. నగరంలోని స్థానిక మల్లు స్వరాజ్యం ట్రస్టు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్యుటిఎఫ్) జిల్లా కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీ అయిన ఎస్జీటీ ఉపాధ్యాయులందరిని వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. సర్వీసు నిబంధనల సవరణకు ముందు ఏర్పడిన స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ, పిడి ఖాళీలను కామన్ సీనియారిటీ ప్రకారం ఎస్జీటీలకు పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కూడా ఉపాధ్యాయ ఎమ్ఎల్సి ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని గతంలో టీఎస్‌యూటీఎఫ్ చేసిన ప్రాతినిధ్యం పరిగణలోకి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కాబట్టి తక్షణమే పి ఎస్, యుపిఎస్ లో పని చేస్తున్న టీచర్స్‌కు ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. బకాయి పడిన ఆరు డిఎలను తక్షణమే విడుదల చేయాలని, పిఆర్సి రిపోర్టును తెప్పించుకుని ఫిట్‌మెంట్‌ను తేది: 01.07-2023 నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. 317 జి .ఓ. వల్ల స్థానికత కోల్పోయిన టీచర్స్ అందరినీ సొంత జిల్లాలకు కేటాయించాలని, ట్రెజరీ ఆమోదం పొంది ఆర్థికశాఖ వద్ద మూలుగుతున్న బిల్లులను క్లియర్ చేయాలి కోరారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, నూతన నియామకాలు చేపట్టి ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి కోర్టు కేసు క్లియర్ అయ్యేలా కృషి చేసి బదిలీల ప్రక్రియను పూర్తిచేయాలని, 010 ద్వారా వేతనాలు చెల్లించాలని అన్ని పాఠశాలల్లో పారిశుద్య కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు.